RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 173 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

శనివారం 22, అక్టోబర్ 2022



అమరవీరులకు ఘనంగా నివాళులు 2లో



బిజెపి భయంతో కెసిఆర్ దిగిరాక తప్పలేదు 5లో

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



# బిజెపికి షాక్..

- బిజెపికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చిన టిఆర్ఎస్
- స్వామిగౌడ్, దాసోజ్ శ్రవణ్‌ల ఘర్ వాపసీ
- మరికొందరు నేతలు బిజెపిని వీడే ప్రయత్నాలు
- కెటిఆర్ మంత్రాంగంతో బిజెపి ఉక్కిరిబిక్కిరి
- పార్టీలోకి స్వామిగౌడ్, దాసోజలను తిరిగి ఆహ్వానించిన కెటిఆర్

**హైదరాబాద్,అక్టోబర్21(ప్రజామంటలు):** మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ భారతీయజనతాపార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. భువనగిరి మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్‌ను బిజెపిలో చేర్చుకోవడంతో అంతకు మించి అన్నట్లుగా బిజెపికి దిమమతిరిగేలా టిఆర్ఎస్ షాకిచ్చింది. అంతేగాకుంగా బిజెపి నినాదం ఘర్ వాపసీని అమలుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా తొలుత రెండు బారీ వికెట్లను బిజెపి నుంచి ఔట్ చేసింది. శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్, దాసోజు శ్రవణ్ బిజెపిని వీడి టీఆర్ఎస్‌లో చేరేలా కెటిఆర్ మంత్రాంగం నడిపారు. తెలంగాణలో టీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం తామేనని ధీమాతో ఉన్న కాషాయపార్టీ నేతలకు అధికార టీఆర్ఎస్ పార్టీ షాకులిస్తోంది. ఓ విధంగా చెప్పాలంటే టీఆర్ఎస్ వ్యూహంలో బీజేపీ చిక్కుకుందనే చెప్పొచ్చు. రాష్ట్రంలో బీసీ సామాజికవర్గం ఎజెండాతో బీజేపీ ముందుకుపోతోంది. ఇదే సామాజికవర్గానికి చెందిన నేతలను టీఆర్ఎస్‌లో చేర్చుకుని కమలం పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. వరుసగా బీజేపీకి ఆ పార్టీ నేతలు గుడ్‌బై చెబుతున్నారు. దీంతో తెలంగాణ కాషాయపార్టీలో కలవరం మొదలైంది. గురువారం భిక్షమయ్య గౌడ్, నేడు దాసోజు, స్వామిగౌడ్ బీజేపీకి రాజీనామా చేశారు. మునుగోడు ఉపఎన్నిక వేళ బీజేపీకి బీసీ నేతలు దూరమవుతున్నారు. అలాగే జితేందర్ రెడ్డి, విఠల్, ఏనుగు రవీందర్ రెడ్డిలు బీజేపీని వీడుతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయా నేతలు ఖండించారు. మాజీమంత్రి దేవేందర్ గౌడ్ తనయుడు వీరేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లకు మంత్రి కేటీఆర్ ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో బీజేపీ నేతలు అప్రమత్తమయ్యారు. దిద్దుబాటు చర్యలకు ఆ పార్టీ అధిష్టానం దిగింది. పార్టీని వీడొద్దంటూ నేతలను అధిష్టానం బుజ్జగిస్తోంది. ఈ క్రమంలో టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ మిగతా... 2లో

## చేనేతపై జిఎస్టీని

# ఎత్తివేయాలి

### వ్యవసాయం తరవాత చేనేతదే పెద్ద పరిశ్రమ

- వారిని ఆదుకునేందుకు అనేక చర్యలు
- తెలంగాణ వచ్చాకనే నేతన్నలకు అండగా నిలిచాం
- పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్



**హైదరాబాద్,అక్టోబర్21(ప్రజామంటలు):** కేసీఆర్‌ది చేతల ప్రభుత్వం, చేనేతల ప్రభుత్వమని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలోని చేనేతల సంక్షేమం కోసం తమ ప్రభుత్వ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని ఆయన తెలిపారు. జిల్లాలోని తుర్కయంజల్ మున్సిపాలిటీ మన్నెగూడలో జరిగిన పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ కు చేనేత కార్మికుల కన్నీటి గాధలు తెలుసునన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చేనేత కార్మికులు బతుకులు ఆగమయ్యాయని, స్వరాష్ట్రంలో చేనేత అభివృద్ధి కోసం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ ఎనిమిదేళ్లలో చేనేత కార్మికుల కోసం ఇప్పటివరకు 5 వేల 752 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల కోసం చేనేత మిత్ర పథకాన్ని తీసుకొచ్చామని మంత్రి చెప్పారు. నూలు, రసాయనాల మీద 40 శాతం సబ్సిడీ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి కేటీఆర్ అన్నారు. నేతన్నలకు సంబంధించి ఏమైనా పాత బకాయిలు ఉంటే వెంటనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. నేతన్నల డిజైన్లను ఎవరైనా కాపీ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 37 వేల వరకు మర మగ్గాలు, 16 వేల వరకు చేనేత మగ్గాలకు జియో ట్యాగింగ్ చేశామని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు బంధు, రైతు భీమా పథకాలు తీసుకొచ్చి రైతులను ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా రైతు బీమా లాగానే చేనేత కార్మికులకు కూడా ప్రభుత్వం బీమా ఇస్తోందని, దురదృష్టవశాత్తు ఎవరైనా చేనేత కార్మికుడు చనిపోతే వారం రోజుల్లో రూ.5 లక్షలు బీమా చెల్లిస్తున్నామని తెలిపారు. అర్హులైన చేనేత కార్మికులకు నెలకి రూ.2 వేల పెన్షన్ ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు. పద్మశాలిల కోసం కోకాపేటలో పద్మశాలి ఆత్మ గౌరవ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేతన్నల ఆత్మహత్యలు చూసి కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకున్నారని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని కుల మిగతా... 2లో

# కాళేశ్వరంలో భారీ అవినీతి

- అంచనా వ్యయం పెరిగింది
- ఆయకట్టు మాత్రం పెరగలేదు
- కాగ్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్ షర్మిల
- దర్యాప్తు చేయించాలని వినతి



**న్యూఢిల్లీ,అక్టోబర్21(ప్రజామంటలు):** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాగ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగిందే తప్ప ఆయకట్టు పెరగలేదని ఆరోపించారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై కాగ్‌కు షర్మిల ఫిర్యాదు చేశారు. శుక్రవారం కంట్రోలర్ ఆడిటర్ జనరల్ గిరీష్ ముర్మును వైఎస్సార్టీపీ అధినేత్రి కలిశారు. కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపై దర్యాప్తు చేసి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని కాగ్‌ను షర్మిల కోరారు. కాళేశ్వరంగా ప్రాజెక్టు అంచనాను లక్షా 20 వేల కోట్లకు పెంచడంపై వాస్తవాలు వెలుగులోకి తేవాలని కాగ్ అధికారులను కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి అక్రమాలపై తన వద్ద ఉన్న ఆధారాలను షర్మిల కాగ్‌కు అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిలో కేసీఆర్ హస్తం ఉందన్న ఆమె.. రాష్ట్రంలో ప్రతి ప్రాజెక్టులో అవినీతి జరిగిందని విమర్శించారు. కాళేశ్వరం అన్ని ప్యాకేజీల్లో అవినీతి జరిగిందని దీనిపై కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్‌కి అన్ని ఆధారాలు సమర్పించినట్లు చెప్పారు. ఇరిగేషన్, ఐఐటీ నిపుణులతో కలిపి స్వతంత్ర దర్యాప్తు జరుపుతామని కాగ్ హామీ ఇచ్చారని అన్నారు. మిగతా... 2లో



# ఉత్తరాఖండ్‌లో ప్రధాని మోడీ పర్యటన

- కేదార్‌నాథ్‌లో ప్రత్యేక పూజలు

**హరిద్వార్,అక్టోబర్21(ప్రజామంటలు):** ప్రధాని నరేంద్ర మోడీ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని మోడీ రాకతో కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను సుమారు రెండు క్వింటాళ్ల మిగతా... 2లో

# డిఎవి పాఠశాల గుర్తింపు రద్దు

- ఎల్‌కేజి విద్యార్థినిపై లైంగిక దాడి
- విద్యాశాఖకు మంత్రి సబిత ఆదేశాలు



**హైదరాబాద్,అక్టోబర్21(ప్రజామంటల):** ఎల్‌కేజీ బాలికపై లైంగిక వేధింపులకు కారణమైన బంజారాహిల్స్ లోని బీఎస్‌డి డీఏవీ పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి జిల్లా విద్యా శాఖాధికారిని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేలా పక్కనే ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేసే బాధ్యత పూర్తిగా డీఈవోదేనని మిగతా... 2లో

# ఆరోగ్య వివరాలను డిజిటల్‌లో...

- బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి
- ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేయలన్న మంత్రి సబిత



**హైదరాబాద్,అక్టోబర్21(ప్రజామంటలు:** బాసరలోని ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆరోగ్య వివరాలను డిజిటల్‌లో నమోదుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలించి డిజిటలైజ్ చేయాలని సూచించారు. ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో 6,500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 1200 మంది విద్యార్థులకు దృష్టి మిగతా... 2లో

# విలువలకు చోటు లేదు

- అందుకే పార్టీ మారానని అన్న బూర



**నల్లగొండ,అక్టోబర్21:** చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం ఆంథోల్ మైసమ్మ దేవాలయం వద్ద బీజేపీ నాయకుడు బూర నర్సయ్య గౌడ్ ప్రత్యేక పూజలు చేసారు. టీఆర్ఎస్‌లో వ్యక్తిగత మిగతా... 2లో


# కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావు

- చౌటుప్పల్ రోడ్‌షోలో ఓటర్లకు కేటీఆర్ పిలుపు
- రాజగోపాల్‌రెడ్డి ఏనాడూ ప్రజాసమస్యలను పట్టించుకోలేదు
- రూ.18వేల కోట్ల కాంట్రాక్టు కోసం మునుగోడు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిరు
- జన్‌ధన్ ఖాతాల్లో పడాల్సిన డబ్బులన్నీ ఆయన ఖాతాలో..
- ఏటా 2 కోట్ల ఉద్యోగాలంటూ మోదీ పకోడీ మాటలంటూ ఏద్దేవా...




**చౌటుప్పల్, అక్టోబర్ 21(ప్రజామంటలు):** మునుగోడు ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థి శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గారికి మద్దతుగా మంత్రులు శ్రీ జగదీష్ రెడ్డి, శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి చౌటుప్పల్ రోడ్ షో లో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించిన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి శ్రీ కేటీఆర్. నవంబర్ 6వ తేదీన మునుగోడు మిగతా... 2లో

## ప్రజానాడి




# శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేదు

- ఆధునిక సాంకేతికలో ముందంజలో ఉన్న తెలంగాణ
- పోలీసుల అమరుల దినోత్సవంలో డిజిపి నివాళి



**హైదరాబాద్,అక్టోబర్21(ప్రజామంటలు):** శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీస్ శాఖ సమర్ధవంతంగా పనిచేస్తున్నదని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలో దేశంలోనే ముందంజలో ఉన్నామని చెప్పారు. ఒకే రాష్ట్రం, ఒకే సేవ అనే సూత్రంతో స్నేహపూర్వక సేవలు అందిస్తు న్నామని వెల్లడించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్ రెడ్డి హాజరయ్యారు. అమరు లైన పోలీసులకు నివాళులర్పించారు. అనంతరం డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జవాబుదారీతనం, పారదర్శకత, బాధ్యతాయుత పోలీసు సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో 15 లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళు న్నామని చెప్పారు. నేరం చేస్తే శిక్ష నుంచి తప్పించుకోలేని మిగతా... 2లో

# ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్ష ఫలితాలు విడుదల



**హైదరాబాద్ అక్టోబర్ 21(ప్రజామంటలు):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎస్ఐ, కానిస్టేబుల్ భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్ఐ, కానిస్టేబుల్, ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్స్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ ప్రాథమిక పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. 554 ఎస్ఐ పోస్టులకు ఆగస్టు 7వ తేదీన రాత పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. 15,644 కానిస్టేబుల్, 63 ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్, 614 ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ పోస్టులకు ఆగస్టు 28న రాత పరీక్ష నిర్వహించిన విషయం విదితమే. ఎస్ఐ పోస్టులకు 2,25,668 మంది రాత పరీక్ష రాయగా, 1,05,603(46.80 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు 5,88,891 మంది రాత పరీక్ష రాయగా, మిగతా... 2లో

# అమరవీరులకు ఘనంగా నివాళులు

## వారిత్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి
## జాతి సేవకు పునరంకితం కావాలి
## సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్,అక్టోబర్21:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరుల సేవలను స్మరిస్తూ సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని అమరవీరుల స్మారక స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించి అమరవీరులకు నివాళులర్పించారు. ఏటా అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరన దినోత్సవాన్నిజరుపుతారు. ఈ సందర్భంగా సీపీ రు మాట్లాడుతూ పోలీసులు జాతి సేవకు పునరంకితం కావాలన్నారు. సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల భవిష్యత్తు మంచి కోసం ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతీఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసుల త్యాగాలను నిత్యం స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. దేశ భద్రత చూసుకునే బాధ్యత సైనికులదైతే, దేశంలోని అంతర్గత భద్రత చూసుకునే బాధ్యత పోలీసులదేనన్నారు. సమాజంలో ఎవరికి ఏ కష్టం, నష్టం, వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసేనని అన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో నూ మొక్కవోని ధైర్యంతో పోలీసులు విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడేందుకు తన ప్రాణాలను సైతం పణంగా పెడతానని ప్రతి పోలీస్ విధుల్లో చేరినప్పుడు ప్రమాణం చేస్తారు. పోలీస్ స్టేషన్ కి వెళ్తే న్యాయం జరుగుతుందని ప్రజలు భావిస్తారు. అందుకు తగ్గట్టుగానే విధులు నిర్వర్తించి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని పొందిన వారున్నారన్నారు. ప్రజలకు పోలీస్ శాఖ పట్ల మరింత నమ్మకం కలిగే విధంగా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజల కోసం చేస్తున్న కృషి ఆమోఘమని చెప్పారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు ప్రజారక్షణ, శాంతి పరిరక్షణ కోసం నిరంతరం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకి, ప్రాణాలని పణంగా పెట్టి ప్రజల



కోసం పోలీసు చేసిన త్యాగానికి గౌరవం చూపించడం మనందరి బాధ్యత అన్నారు.
కొత్తగా పోలీసు బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు రాబోతున్నవారికి విధి నిర్వహణలో స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని నింపడమే పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడంలోని ప్రధాన ఉద్దేశమన్నారు. పోలీసులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా దాదాపు 264 పోలీసులు విధి నిర్వహణలో అరులయ్యారని జోహార్ల తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అమరుల మరణం వారి కుటుంబసభ్యులకు తీరని లోటని, చనిపోయిన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని తెలిపారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే డిపార్ట్ మెంట్ పోలీసులు.. కాబట్టి పోలీసులకు ఎప్పుడూ సహకరించాలన్నారు. 1959 ఇండో-చైనా సరిహద్దులో చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. ఈ యుద్ధంలో ఎంతో మంది సైనికులు అమరులయ్యారన్నారు. అలాగే 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పది మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారని తెలిపారు. అనంతరం పోలీసు వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీస్ మరవీరులకు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఆమన్గల్ ఎస్ఐ కే హనుమంత్ రెడ్డి, తలకొండపల్లి పోలీస్ కనిస్టేబుల్ ఫహీముద్దీన్, ఆర్మేడ్ కనిస్టేబ్లుల్ ఈశ్వర్ రావును సేవలను స్మరించుకుంటూ అమర వీరుల కుటుంబ సభ్యులను సైబరాబాద్ సీపీ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ సీపీ గారు మాట్లాడుతూ.. భారత్-చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్యన ఉన్న వేడి నీటిబుగ్గ అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా మన మధ్య నిలిచి ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి టి శ్రీనివాస్ రావు, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, విమన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ కవిత, సైబర్ క్రైమ్ ఏడిసిపి రితిరాజ్, అడ్మిన్ డీసీపీ ఇందిర, ఏడీసీపీ రవి కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ ఎండీ రియాజ్ ఉల్ హక్, ఏడీసీపీ వెంకట్ రెడ్డి, ఎస్ఓటి ఏడిసిపి నారాయణ, ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, పోలీస్ అధికారులు సంఘం అధ్యక్షుడు భద్రా రెడ్డి, వివిధ సెక్షన్ల సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావు

నియోజకవర్గంలో కాబోయే ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. చౌటుప్పల్ వస్తుంటే..



యువత అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. మీ ఊపు, జోష్ చూస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ డిపాజిట్ వస్తదో, రాదో అనుమానం కొడుతున్నదని కేటీఆర్ తెలిపారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉన్నదని.. దాని నిర్మూలించేందుకే సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ప్రారంభించారు. నీతి ఆయోగ్ ఆ ప్రాజెక్టును ప్రశంసించి, రూ. 19 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫారసు చేసింది. కానీ కేంద్రం 19 పైసలు కూడా ఇవ్వలేదు. రాజగోపాల్ రెడ్డికి మాత్రం రూ. 18 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చిందు. రాజగోపాల్ రెడ్డిని అడ్డం పెట్టుకుని ఇక్కడ చొరబడుతున్నాడు. అవసరమైతే ఓటుకు తులం బంగారం ఇస్తానని రాజగోపాల్ రెడ్డి చెబుతుండటంట. ఆ తులం బంగారం తీసుకోండి.. ఓటు మాత్రం అండగా ఉన్న కారు గుర్తుకు వేయండి. ఈ పైసలు గుజరాత్ గద్దల పైసలు. మునుగోడు ఆత్మగౌరవాన్ని కొనేందుకు ఎర వేస్తున్నారు. డబ్బు అహంకారానికి ఓటుతో సమాధానం చెప్పాలని ఓటర్లకు కేటీఆర్ పిలుపునిచ్చారు. 2018లో రాజగోపాల్ రెడ్డిని గెలిపించారు. కాంగ్రెస్ తరపున గెలిచిన మరుసటి రోజు నుంచే బీజేపీ పాట పాడారు. బీజేపీతో కోవర్ట్ రాజకీయాలు చేసి, బేరసారాలు ఆడారు. రూ. 18 వేల కోట్ల కాంట్రాక్ట్ వచ్చిన తర్వాత గుజరాతీ బాస్ ల వద్ద మునుగోడు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టాడు. మునుగోడు నియోజకవర్గ సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు. కేవలం అహంకారంతోనే.. అంగడి సరుకు మాదిరిగా ఓటర్లను కొనేస్తా అని బలవంతంగా ఎన్నిక రుద్దారు. ఇది మునుగోడు ప్రజలు కోరుకున్న ఎన్నిక కాదు.
తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసిందో పల్లెల్లో, పట్టణాలకు వెళ్తే తెలుస్తుంది. టీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు.. ఎవరైనా చనిపోయి అంత్యక్రియలకు పోతే.. అర్ధగంట కరెంట్ ఇవ్వమని అడుక్కున్నాం. విత్తనాలు, ఎరువుల కోసం గోసపడ్డాం. అన్నింటిని ఎదుర్కొని పంట పండిస్తే కనీసం మద్దతు ధర లభించకపోయేది. కొనుగోలు కేంద్రాలు లేవు. కానీ ఇప్పుడు అన్ని వసతులు మన ముందుకు వచ్చాయి. తెలంగాణ రైతులు ఇవాళ సంతోషంగా ఉన్నారు. ఒకనాడు నల్లగొండ అంటే నీళ్లు లేని ప్రాంతం. ఈ రోజు మొత్తం తెలంగాణలో అత్యధికంగా వరి పండించే జిల్లా నల్లగొండ అని చెప్పొచ్చు. ఇది కేసీఆర్ నాయకత్వంలో సాధ్యమైంది. మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఫ్లోరైడ్ సమస్య ఉండేది. పిల్లను ఇచ్చేందుకు కూడా ఆలోచించే పరిస్థితి. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక.. ఇంటి ముందే నల్లా పెట్టి, సురక్షిత తాగునీరు అందిస్తున్నాం. మిషన్ భగీరథ పైలాన్‌కు చౌటుప్పల్‌లో పైలాన్ వేసి, ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాం. నాలుగేండ్లలోనే మంచినీళ్లు ఇచ్చాం. కరెంట్ తాగునీరే కాదు.. సాగునీరు రంగంలో కూడా అద్భుతమైన పురోగతి సాధించాం. ఈ నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తవుతున్నాయి.
రైతుబంధును పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తున్నాయి. రైతుబీమాను కూడా పకడ్బందీగా అమలు చేస్తున్నాం. చండూరు, చౌటుప్పల్‌ను మున్సిపాలిటీగా మార్చాం. మీ నియోజకవర్గాన్ని రాజగోపాల్ రెడ్డి అనాథగా చేశారు. ఈ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని డెవలప్ చేస్తాను. చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల విషయంలో అద్భుతమైన అభివృద్ధి చేసి చూపించే బాధ్యత మాది. రాజగోపాల్ రెడ్డి పట్టించుకోక పోయినా.. అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. దండు మల్కాపురంలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తున్నాం. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడ ఇది అని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాళేశ్వరంలో భారీ అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

మేఘ కంపెనీ చేపట్టే ప్రతి ప్రాజెక్టులో అవినీతి జరుగుతుందని షర్మిల ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఇప్పటికే సీబీఐకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొని కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని షర్మిల అభిప్రాయపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికను ప్రజలు బహిష్కరించాలని షర్మిల పిలుపునిచ్చారు. ఇది వచ్చిన ఎలక్షన్ కాదు, తెచ్చుకున్న ఎన్నిక అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి మునుగోడు బైపోల్ తీసుకొచ్చారని షర్మిల మండిపడ్డారు. వివేకా హత్య కేసు దర్యాప్తుపైనా షర్మిల స్పందించారు. సుప్రీంకోర్టు ఆ కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయడం మంచిదని అభిప్రాయపడ్డారు. సీబీఐ దర్యాప్తులో అన్ని విషయాలు బయటకు వస్తాయన్న షర్మిల.. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ఉత్తరాఖండ్‌లో ప్రధాని మోడీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయం సందర్శన నేపథ్యంలో మోడీ సంప్రదాయ పహాడీ దుస్తుల్లో కనిపించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా మహిళలు తయారు చేసిన దుస్తులను ఆయన ధరించారు. అయితే ప్రధాని మోడీ కేదార్‌నాథ్‌ను సందర్శించడం ఇది ఆరోసారి. ఆలయ సందర్శన నేపథ్యంలో రోప్‌వే ప్రాజెక్టుకు మోడీ శంకుస్థాపన చేయనున్నారు. గౌరీ కుండ్ నుంచి కేదార్‌నాథ్, గోవింద్‌ఘట్ నుంచి హేమకుండ్ సాహిబ్‌లను కలుపుతూ రెండు కొత్త రోప్‌వే ప్రాజెక్టును అందుబాటులోకి రానున్నాయి. 3,400 కోట్లతో కేంద్ర సర్కార్ కొత్త రోప్‌వే ప్రాజెక్టులను చేపడుతోంది. ఇక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మోడీ పరిశీలించనున్నారు. అలాగే ఆదిగురువు శంకరాచార్యుల సమాధి స్థలాన్ని సందర్శించారు. కేదార్‌నాథ్‌లోని మందకి అస్తపథం, సరస్వతీ అస్తి పథాలను పరిశీలించారు. ప్రధాన పర్యటన నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ రెం రోజుల పాటు మోడీ పర్యటన కొనసాగనుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో మోడీ



రెండు రోజుల పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పనులను పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు అధికారులను అడిగి తెలుసు కోనున్నారు. గౌరీకుండు నుంచి కేదార్‌నాథ్ 9.7 కిలోమీటర్ల రోప్‌వే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. కాగా, అంతకు ముందు డెహ్రాడూన్‌లోని జాలీ గ్రాంట్ ఎయిర్‌పోర్టుకు ఉదయం ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. మోడీ రాక సందర్భంగా ఆ రాష్ట్ర గవర్నర్ గుర్మీత్ సింగ్, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఘన స్వాగతం పలికారు.

# టిఆర్ఎస్‌ను ఓడించాలి: బీసీ పొలిటికల్ జేఏసీ పిలుపు

**హైదరాబాద్,అక్టోబర్21:** మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా బీసీలు ఓట్లు వేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ పిలుపునిచ్చింది. బీసీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేసీఆర్ కు వ్యతిరేకంగా గన్ పార్క్ ముందు ఆందోళనకు దిగారు. మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ మరోసారి హామీల పేరుతో మోసం చేసే కుట్ర చేస్తోందని జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ ఫెడరేషన్లు, కార్పొరేషన్లు కనుమరుగయ్యాయని రాచాల యుగంధర్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోటాను తగ్గించారని రాచాల యుగంధర్ మండిపడ్డారు. 70శాతం ఉన్న బీసీలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిజెపికి షాక్..


(మొదటి పేజీ తరువాయి)

సమక్షంలో వీరు పార్టీ కండువా కప్పుకున్నారు. స్వామిగౌడ్ తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడారని, దాసోజు శ్రవణ్ పాలిటిక్స్‌లో సెల్ఫ్ మేడ్ లీడర్ అని కేటీఆర్ అన్నారు. వీరిద్దరూ సొంతగూటికి చేరుకోవడం సంతోషంగా ఉందని కేటీఆర్ అన్నారు. కాగా గతంలో వీరిద్దరూ టీఆర్ఎస్ లో కీలకంగా పనిచేశారు. తాజాగా దాసోజు శ్రవణ్, స్వామిగౌడ్ టీఆర్ఎస్ పార్టీలో చేరడంతోనే ఆగలేదని, మరికొం దరు బిజెపిని వీడి టిఆర్ఎస్‌లో చేరుతారన్న ప్రచారం ఊపందుకుంది. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే బూడిద భిక్షమయ్య గౌడ్ బీజేపీకి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీలోకి చేరిన విషయం తెలిసిందే. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అనుసరిస్తున్న తీరు అత్యంత జుగుస్సాకరంగా ఉందని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. నోట్లు పంచి మునుగోడు ఉప ఎన్నికల్లో గెలవాలనుకుంటున్న బీజేపీ తీరు పట్ల నిరసన తెలియజేస్తూ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానట్లు శ్రవణ్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించడంలో బీజేపీ విఫలమైందని స్వామిగౌడ్ స్పష్టం చేశారు. బీజేపీలో ధనవంతులు, కాంట్రాక్టర్లకే ప్రాతినిధ్యం అధికంగా ఉందని పేర్కొ న్నారు. బలహీన వర్గాల ఉన్నతికి బీజేపీ సహకరించడం లేదన్నారు.

# చేనేతపై జిఎస్టీని ఎత్తివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వృత్తులను కాపాడుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పుడు చేనేత కళాకారులను అనేక పథకాలతో కేసీఆర్ ఆదుకుంటున్నారని అన్నారు. వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద రంగం చేనేత, జౌళి రంగం అని కేటీఆర్ తెలిపారు. ఈ రంగంపై కేసీఆర్‌కు మొదట్నుంచి అవగాహన ఉంది. దుబ్బాకలో హైస్కూల్‌లో చదువుకున్న సమయంలో పద్మశాలీ ఇంట్లో ఉండేవారు. అప్పట్నుంచే చేనేత కళాకారుల కన్నీళ్ల గురించి కేసీఆర్‌కు తెలుసు. భూదాన్ పోచంపల్లిలో ఒకటే వారంలో ఎనిమిది మంది చేనేత కళాకారులు ఆత్మహత్య చేసుకున్నారు. కేసీఆర్ చలించిపోయి, జోలేపట్టి డబ్బులు సేకరించి, లక్ష రూపాయాల చొప్పున ఇచ్చారు. సిరిసిల్లలో కూడా నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్ల గోడల మీద రాతలు చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. నేతన్న చావొద్దు.. నీ కుటుంబం ఉసురు పోసుకోవద్దని నాటి కలెక్టర్ రాయించి, ఆత్మస్థైర్యం నింపారు. సిరిసిల్లలో తొమ్మిది మంది నేతలు బలవన్మరణం పాల్పడితే.. వారిని ఆదుకోవాలని నాటి ముఖ్యమంత్రికి కేసీఆర్ లేఖ రాశారు. కానీ స్పందించలేదు. ఒక పార్లమెంట్ సభ్యుడిగా టీఆర్ఎస్ నుంచి రూ. 50లక్షలు ఇచ్చి సూక్ష్మ రుణాలు ఇవ్వండి. ఆత్మహత్యలు ఆపండి అని కేసీఆర్ నాటి అధికారులను ఆదేశించారు. ఆనాడు మీ కష్టాలను అర్థం చేసుకుని, 2014లో ప్రభుత్వం



ఏర్పడిన తర్వాత చేనేత, జౌళి బ్జడెట్ ను రూ. 70 కోట్ల నుంచి రూ. 1200 కోట్లకు పెంచారు. చేనేత, జౌళి శాఖకు ఇప్పటి వరకు రూ. 5,752 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధికారులను పిలిచి సీఎం సమీక్షించారని కేటీఆర్ గుర్తు చేశారు. నెలకు ఎంత ఆదాయం వస్తున్నదని అడిగారు. మీ డిజైన్లను కాపీ కొడితే కఠినంగా కేసులు పెట్టి, లోపల వేయించే బాధ్యత తీసుకుంటాను. అవసరమైతే చట్టాల్లో మార్పులు చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు. చేనేత మిత్ర ద్వారా నలభై శాతం నూలు, రసాయనాల మీద సబ్సిడీ ఇస్తున్నాం. పాత బకాయిలు ఉంటే వాటిని కూడా సంపూర్ణంగా విడుదల చేయిస్తామన్నారు. నేతన్నకు చేయూత అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా కరోనా సమయంలో 26 వేల మంది కార్మికులకు లాభమైందని కేటీఆర్ తెలిపారు.



# తమ్ముడికే ఓటేయాలంటూ వినతి

## కోమటిరెడ్డి ఆడియో కలకలం

హైదరాబాద్,అక్టోబర్21: మునుగోడు ఉపఎన్నికలో పార్టీ చూడకుండా నా సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి మద్దతు ఇచ్చి ఓటు వేయాలని ఓ కాంగ్రెస్ నేతతో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడిన ఆడియో కాంగ్రెస్ శ్రేణులను గందరగోళానికి గురిచేస్తోంది. ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బిజెపి నుంచి పోటీ చేస్తుండగా.. వెంకట్‌రెడ్డి మాత్రం తాను పార్టీ మారేది లేదని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ తరుపున ప్రచారం చేయబోననే విషయాన్ని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ క్రమంలో మద్దతు కోరుతూ ఓ కాంగ్రెస్ నేతతో వెంకట్‌రెడ్డి మాట్లాడిన ఆడియో వైరల్‌గా మారింది. మునుగోడు ఉపఎన్నికలో పార్టీ చూడకుండా నా సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి మద్దతు ఇచ్చి ఓటు వేయాలి. మంచీచెడు సమయాల్లో రాజగోపాల్‌రెడ్డి అందుబాటులో ఉంటూ సాయం చేస్తాడు. నాకు పీసీసీ అధ్యక్ష పదవి వస్తుంది. అధ్యక్ష పదవి వచ్చాక రాష్ట్రంలో పాదయాత్ర చేస్తాను. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాను' అని ఆ ఆడియోలో వెంకట్‌రెడ్డి మాట్లాడారు.

# ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్ష ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

1,84,861 (31.39 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్ పోస్టులకు 41,835 మంది రాత పరీక్ష రాయగా, 18,758(44.84 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు 2,50,890 మంది రాత పరీక్ష రాయగా, 1,09,518(43.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

# డిఎవి పాఠశాల గుర్తింపు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన భద్రతా పరమైన చర్యలను ప్రభుత్వానికి సూచించేందుకు విద్యాశాఖ కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీలో పాఠశాల విద్యా శాఖ సంచాలకులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, పోలీస్ విభాగంలో మహిళల భద్రతను పర్యవేక్షిస్తున్న డీఐజీ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారని మంత్రి పేర్కొన్నారు. ఈ కమిటీ తన నివేదికను వారం రోజుల్లోగా అందిస్తుందని వెల్లడించారు. ఈ నివేదిక ఆధారంగా విద్యార్థుల భద్రతకు సంభందించి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసే బాధ్యతపై ఆయా పాఠశాలల యాజమాన్యాల నుంచి హామీపత్రం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.

# ఆరోగ్య వివరాలను డిజిటల్‌లో...

(మొదటి పేజీ తరువాయి)

లోపాలు, కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కంటి అద్దాలు అవసర మైన విద్యార్థులకు శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కంటి అద్దాలు అందజేశారు. 600 మంది విద్యార్థులకు ఎనిమియా ఉందని గుర్తించి వారికి కూడా అవసరమైన మందులను అందజేయ నున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సదుపాయాలను, వైద్య సిబ్బంది నియామకాన్ని వెంటనే చేపట్టాలని వైస్ ఛాన్సలర్ ను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం విద్యార్థుల నుంచి ఆరోగ్య వివరాలు సేకరించడంతో పాటు 18 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నిర్ణీత కాలానుగుణంగా పరీక్షలను నిర్వహిస్తూ వాటి ఫలితాలను ప్రత్యేక పోర్టల్‌లో నిక్షిప్తం చేయనున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి వాకాటి కరుణ, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేదు

(మొదటి పేజీ తరువాయి)

విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పౌరుల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. విధినిర్వహణలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులు అర్పిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది 264 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. తెలంగాణను నేర రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. దేశంలోనే రాష్ట్ర పోలీసు వ్యవస్థ ముందుండటం గర్వంగా ఉందని డీజీపీ చెప్పారు.

# విలువలకు చోటు లేదు

(మొదటి పేజీ తరువాయి)

విలువలు లేకనే పార్టీ మారానని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ లో వివిధ సామాజిక వర్గాల వారికి వ్యక్తిగత విలువలు లేవని విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఆత్మగౌరవం చంపుకుని దండం పెట్టుకుంటూ తిరుగుతున్నారని ఆరోపించారు. దండాలు పెట్టుకుంటూ తిరిగే వారికే టీఆర్ఎస్ పార్టీలో గుర్తింపు ఉంటుందన్న ఆయన... బీజేపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని బూర నర్సయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. రాజగోపాల్ రెడ్డి రాజీనామా తర్వాతనే కేసిఆర్ గట్టుప్పల్ మండలాన్ని ప్రకటించాడని తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన పోడు భూములను టీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుంటుందని ఆరోపించారు. దళితుల కుటుంబాల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని డిమాండ్ చేశారు.

# ఉద్యమ ఘట్టాలతో కూడిన యోధ

## పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి కెటిఆర్

**హైదరాబాద్,అక్టోబర్21:** సిద్దిపేట ఉద్యోగ గర్జన దినోత్సవం సందర్భంగా ఉద్యమ ఘట్టాలతో కూడిన 'యోధ' పుస్తకాన్ని మంత్రి కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమ నేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో 21-10-2009లో సిద్దిపేటలో ఉద్యోగ గర్జన చేపట్టారు. నాటి ఉద్యోగుల ఉద్యమ నాయకుడు, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఉద్యమ ప్రస్థానం, ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర, ఉద్యమ ప్రధాన ఘట్టాలపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘంతోపాటు, ఉద్యోగ జేఏసీ.. 'యోధ' పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ ఐక్య కార్యచరణ నాయకులతో కలిసి ఉద్యమ కాలంనాటి అనేక పోరాటాలను, ప్రధాన ఘట్టాలను మంత్రి కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ జేఏసీ నేతలు పాల్గొన్నారు.



సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పిలుపు మేరకు జనగామలో ములాయం చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన పార్టీ నాయకులు, ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్య.

### మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో

# ఎమ్మెల్సీ, జగిత్యాల ఎమ్మెల్యే

**చౌటుప్పల్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా టీఆరెస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ని భారీ మెజారిటీతో



గెలిపించాలని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 9,10 వార్డ్ యందు రజకుల ఆత్మీయ సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వార్డుల ఇంఛార్జి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరై కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కరాజు శ్రీనివాస్ అధ్యక్షులు-రాష్ట్ర రజక సంఘాలు, హిమబిందు-అరుణ్ కుమార్ 9 వ వార్డ్ కౌన్సిలర్, బాలకిషన్ 10 వ వార్డ్ కౌన్సిలర్, ఆశయ్య ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# ప్రముఖ కవి వల్లంపట్లను సన్మానించిన జనగామ కవులు

**జనగామ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** ప్రముఖ కవి,సామాజిక వేత్త, జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వరరావు 67వ జన్మదినం



సందర్భంగా కవులు కళాకారుల ఐక్యవేదిక జనగామ జిల్లా ఆధ్వర్యంలో హన్మకొండకు వెళ్ళి వల్లంపట్లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సోసైటీ నిర్వహణ సారథ్యంలో జరిగిన వల్లంపట్ల ఆర్ట్స్ రాష్ట్ర పురస్కారాలు 2022, ఎలక్షలోచ్చాయ్ నాటిక, సామాజిక చైతన్య గీతాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో కవులు కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ జి.కృష్ణ, కో కన్వీనర్ పెట్లోజు సోమేశ్వరాచారి, శ్రీ శ్రీ కళావేదిక జనగామ జిల్లా అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్, జరసం అధ్యక్షులు అయిలా సోమనర్సింహచారి, సాయి రికార్డింగ్స్ స్టుడియోస్ చిలుమోజు సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మానవతాదృక్పథంతో గోవర్ధనగిరి గ్రామానికి చెందిన సూర్య జయంతి సందర్భంగా వర్ధన్ అనాధ ఆశ్రమంలో కేక్ కటింగ్ చేసి అన్నదానం. పాల్గొన్న ఊల్లెంగుల నరేష్, జోగు భాస్కర్, కర్రె శేఖర్, లక్కీ, అరవింద్, శ్రవణ్ నాని, మను, గుజ్జుల నాలిన్, రంజిత్, రోహిత్, దిలీప్, రాజు.

# 55వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలు

### మహిళల జట్లకు జెర్సీ (టిషర్ట్స్) అందించిన దీకొండ అశోక్

**కొడిమ్యాల అక్టోబర్ 21 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ లో 55 వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఖో ఖో పోటీల లో పాల్గొనబోతున్న మన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పురుషులు మరియు మహిళల జట్లకు



జెర్సీ (టిషర్ట్స్) లను విజ్ డమ్ విద్యా భారతి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ దీకొండ అశోక్ అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి మమత నర్సింహారెడ్డి, 13వ వార్డు సభ్యులు దీకొండ చంద్ర శేఖర్, కరీంనగర్ జిల్లా ఖో ఖో జనరల్ సెక్రెటరీ వై. మహేందర్ రావ్, పి.డి. లు రవీందర్, రాజబాబు, సీనియర్ క్రీడాకారులు గుర్రం నర్సయ్య, రాపర్తి లక్ష్మన్, కృష్ణం రాజు, బల్ల మల్లేశం, బల్కం అనిల్, బల్ల పోషమల్లయ్య, పెంకాసుల వెంకన్న, కొండ అనిల్, దీకొండ సంతోష్(పిసి), చల్ల సంతోష్ (పిసి) దీకొండ వెంకట రమణ, రాపర్తి నవీన్, దీకొండ సంతోష్, లక్ష్మీనారాయణ, రాజేష్ మరియు క్రీడాకారులు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

### డివైడర్లలో ఖర్జూర చెట్లు నాటిన

# మున్సిపల్ చైర్ పర్సన్ డా. భోగ శ్రావణి

**జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజామంటలు):** పార్క్ నుండి కొత్త బస్ స్టాండ్ వరకు నిర్మించిన డివైడర్లలో 20 సం.ల కర్జుర మొక్కలు నాటిన మున్సిపల్ చైర్ పర్సన్ డా. భోగ శ్రావణి. ఈ సందర్భముగా చైర్ పర్సన్ మాట్లాడుతూ. యం.ఎల్.ఎ. డా. సంజయ్ కుమార్ సహకారముతో సమగ్ర పట్టణ అభివృద్ధి దిశగా జగిత్యాలను తిర్చిదిద్దుతున్నమని అందులో భాగముగా కొత్త బస్ స్టాండ్ పాత బస్ స్టాండ్ జంక్షన్ల అభివృద్ధి చేశామని అలాగే ధరూర్ నుండి చింత కుంట చేరవు వరకు డీవైడర్లు ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించడం జరిగినదని, అలాగే పట్టణములో వైకుంతధమలు అభివృద్ధి పరచుకున్నమని, ప్రభుత్వ కార్యాలయాల వద్ద రహదారుల వెడల్పు మరియు సెంట్రల్ లైటింగ్ పూర్తి చేయించామని, ట్రీ పార్క్ లు, తారక రామ ప్రకృతి వనం, పార్కుల అభివృద్ధి ఇలా గతములో కంటే చాలా అభివృద్ధి పనులు చేపట్టి పట్టణమును సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెల్లుచున్నమని, ఈ డివైడర్లలో కూడా 20 సం.ల కర్జురా మొక్కలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బైపాస్ రోడ్ యందు కూడా రహదారి నిర్మాణం చేయుటకు నిధులు మంజూరు కావడం జరిగినదని, అట్టి రహదారి నిర్మాణము చేపట్టుటకు యం.ఎల్.ఎ చోరవతో కాంట్రాక్టర్ తో మాట్లాడి నిర్మాణము చేపట్టుటకు ఇప్పటికే పరిశీలించడం జరిగినదని, వినాయక చవితి, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దసరా తర్వాత నిర్మాణం చేపట్టతమని తెలియజేశారు. ఈ విషయం గమనించి ప్రతిపక్షాలు ఇది వారు చెపితేనే పని జరిగినదని మెప్పు కోసం పనులు చేపట్టే ముందు రాద్దాంతం చేస్తున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలియజేశారు. మా పాలకవర్గంలో పారదర్శకంగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని ప్రజలు కూడా పట్టణ అభివృద్ధి సహకరించాలని కోరారు. అలాగే పట్టణ నడి బొడ్డున ఉన్న మున్సిపల్ మెయిన్ పార్క్ ని తొందరలోనే పూర్తి స్థాయిలో అభివృద్ధి పర్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చెర్మెన్ గోలి శ్రీనివాస్,కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్స్ అల్లే గంగసాగర్,



వొల్లెపు రేణుక, చాంద్ పాషా, డిఈ రాజేశ్వర్, టిపిఓ ప్రవీణ్ కుమార్, ఈఈ, వర్క్ ఇన్స్పెక్టర్స్, నాయకులు దాసరి ప్రవీణ్, పులి శ్రీధర్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ములాయం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి

**హైద్రాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** సమాజ్ వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, యూపీ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ ఆశయాలను కొనసాగిస్తామని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్. సింహాద్రి అన్నారు. నేతాజీ ములాయం చూపిన మార్గాన్ని ప్రతి సమాజ్ వాదీ అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పిలుపు మేరకు హైదరాబాద్ లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ములాయం చిత్ర పటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి మాట్లాడుతూ.... రైతులు, స్త్రీలు, విద్యార్థులు, నిరుద్యోగులు, వెనుకబడిన వారు పలు సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. విద్యా, వైద్యం ప్రైవేట్ పరం చేయడంతో పలు వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 'ధరణి పుత్రుడు' ములాయం మృతి భారతదేశానికి తీరని లోటని అన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ములాయం సాధించిన విజయాలు, అసాధారమైనవని కొనియాడారు. రాంమనోహర్ లోహియా వంటి నేతల స్పూర్తితో రాజకీయాలలోకి అడుగుపెట్టెన ములాయం సింగ్ యాదవ్, జీవితాంతం బడుగు, బలహీనత వర్గాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా ఉత్తర్‌ప్రదేశ్‌ను ములాయం అభివృద్ధి పథంలో నడిపించారని, యూపీలో అనేక సంస్కరణలను, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ములాయం మరణంతో భారత రాజకీయాల్లో ఒక శకం ముగిసింది అన్నారు. ములాయం భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయాలు ప్రతి సమాజ్ వాదీని ముందుకు నడిపిస్తాయని అన్నారు. మత తత్వ రాజకీయాలు దేశాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని, రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలను రక్షించుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని



ములాయం ముందే చెప్పారని అన్నారు. ములాయం చూపిన పోరాట మార్గంలో ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు ప్రకాష్, విజయ్ కుమార్, తాటికొండ రాజయ్య, గోవర్ధన్, మారం తిరుపతి యాదవ్, మేకల క్రిష్ణ, వీరమల్లు యాదవ్, బోనాల విజయ్ కుమార్, రిజ్వావన్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో

# తాసిల్దార్‌కు వినతిపత్రం

**కొడిమ్యాల అక్టోబర్ 21 (ప్రజా మంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతిపత్రం కొడిమ్యాల నుండి నుండి నాచుపల్లి దొంగల మర్రి వెళ్లే దారిలో కొడిమాల సరిహద్దులో వాగుపై నుండి నీరు వచ్చి రాకపోగలకు ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది చాలామంది ద్విచక్ర వాహనాలపై బ్రిడ్జి పై నుండి వెళ్లేవారు నీటి ప్రవాహం వలన కిందపడి కొందరికి కాళ్లు చేతులు విరగడం జరిగిందని వాగు బ్రిడ్జి పై నుండి వచ్చే నీరు లో నడిచి వచ్చి పోయే ప్రజలకు పాకురు వలన కిందపడి దెబ్బలు తాగుతున్నాయి బ్రిడ్జి నిర్మాణం కు టెండర్లు జరిగి నెలలు గడుస్తున్న బ్రిడ్జి నిర్మాణం పని జరగడం లేదు త్వరగా బ్రిడ్జి నిర్మాణం చేయాలని తెలుపుతున్నాము మండలంలోని రైతులకు అందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని కోరుచున్నాము మరియు మండలంలో ఎస్సీ ఎస్టీ బీసీ లు కొందరు పరంపోగు భూమిలో చెట్లు రాళ్లు తీసి కబ్జాలో ఏళ్ల తరబడి ఉన్నవారికి అసైన్మెంట్ పట్టాలు లేవు వారికి వెంటనే పట్టాలు ఇవ్వగలరని మండలంలో ఏళ్లు గడుస్తున్నా బీసీ రుణాల సబ్సిడీ అందగా సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు వారికి లోన్లు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరుచున్నాము మీ ద్వారా పై అధికారుల కు పంపగలరని వినతిపత్రం అందజేస్తున్నాం ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ జిల్లా కార్యదర్శి మెరుగు కిషన్ గౌడ్ మాజీ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు అక్క పెల్లి రవీందర్ మాజీ మండల అధ్యక్షులు బూస గంగాధర్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి చేన్న దేవేందర్ ఎస్సీమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తూరు అంజన్ కుమార్, మాజీ ఎంపిటిసి సురుగు శ్రీనివాస్,



ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు బండారి నరేష్, బిసి మోర్చా మండల అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, మీడియా సెల్ మాజీ అధ్యక్షులు బైరి కార్తీక్, ఓరుగంటి మల్లేశం, మాజీ సీనియర్ నాయకులు అడ్లగట్ల రమేష్, బి. నరేష్ కోలాకాని సాయిబాబా, కొండ లక్ష్మణ్, బిజెపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచండి

- రోగాలను తరిమి కొట్టండి

**జమ్మికుంట అక్టోబర్ 21 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలో 4వ వార్డులో మహిళలకు తడి, పొడి చెత్తను వేరు చేసి పరిసరాల శుభ్రత గురించి మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు అవగాహన కల్పించినారు. అనంతరం ప్రతి ఇంటి కి పండ్ల మొక్కలు మరియు పూల మొక్కలు పంపిణీ చేసి స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో పిల్లలకు మంచిగ చదువుకొని మి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అలాగే పరిశుభ్రత గురించి, అనారోగ్యాన్ని గురికాకుండా ఇంట్లో ఇంటి అవరణలో పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని మీరు, మీ తల్లిదండ్రులకు తెలుపాలని పిల్లలకు అవగాహన కల్పించినారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ దేశినీ స్వప్న కోటి, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్



ఎలగందుల స్వరూప శ్రీహరి, పిట్టల శ్వేత రమేష్, ఆర్ పి లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపికి శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ రాజీనామా

- కేటిఆర్ సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిక
- బీజేపీ ని వీడిన దాసోజు శ్రవణ్ టిఆర్ఎస్‌లో చేరిక

**హైదారాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** శాసన మండలి మాజీ చైర్మన్ తెలంగాణ ఉద్యోగుల సంఘం నాయకుడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుడు గతంలో తెరాస పార్టీ నాయకుడు అయిన స్వామి గౌడ్ బిజెపికి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన తెలంగాణ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ కు ఒక లేఖ రాస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించడంలో బిజెపి విఫలమవుతోందని ఆరోపించారు. తమను కూడా పార్టీలో తగినంత గుర్తింపు ఇవ్వడంలేదని



అనేక అవమానాలకు గురి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా బండి సంజయ్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. అవమానాలు భరిస్తూ తాను పార్టీలో కొనసాగలేనని ఆయన బండి సంజయ్ కి తెలిపారు. మునుగోడు ఎన్నికల్లో కూడా తమకు గుర్తింపు లేదని అక్కడ బడా కాంట్రాక్టర్లు ధనవంతుల రాజ్యమే నడుస్తున్నదని తమలాంటి బీసీ నాయకులు అని గుర్తించే వారే లేరని ఆయన ఆరోపించారు. అందువల్ల తాను బాధతో అవమానాలు భరించలేక బిజెపి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. స్వామి గౌడ్ బిజెపికి రాజీనామా చేయడంతో తన మాతృ పార్టీ అయినా టిఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

**బీజేపీని వీడిన దాసోజు శ్రవణ్, టిఆర్ఎస్‌లో చేరిక:** ప్రత్యేక తెలంగాణ నాయకుడు దాసోజు శ్రవణ్ కుమార్ కూడా బిజెపి పార్టీలోకి రాజీనామా చేసి టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలుస్తున్నది. బిజెపి పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు బీసీలకు అనుకూలంగా లేవని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు అందువల్ల బీజేపీ పార్టీని వీడే వలసి వస్తుందని శ్రవణ్ తెలిపారు.

## సంగీతం భారతీయ వారసత్వ సంపద సంగీత రత్న నరహరి శర్మ

- రామ కిష్టయ్య సంగన భట్ల

శాస్త్రీయ సంగీతం భారతీయ వారసత్వ సంపద అని, సంగీతంలో ఉండే రాగం, తాళం, లయ, స్వరాలకు మానవ జీవితానికి, సైన్స్ కి సంబంధం ఉందని ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు, రంగస్థల కళాకారులు, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ దేవస్థానం ఆస్థాన సంగీత కళాకారులు, శ్రీ లక్ష్మీ నరసింహ నాట్య మండలి ప్రధాన కార్యదర్శి కొరిడే నరహరిశర్మ ఉద్ఘాటించారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం



అద్వర్యంలో శాస్త్రీయ సంగీతం పై విస్తృత ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిదిగా హాజరైన నరహరి శర్మ ప్రసంగంలో.. అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలలో, పదాలలో ఉండే సంగీత రహస్యాలను ఉదాహరణలతో విశ్లేషించే విధానం పై శిక్షణ ఇచ్చారు. దక్షిణాదికి చెందిన సంగీత కళాకారుల కృషిని స్మరించారు. విద్యార్థులు సంగీత సాధన ద్వారా మంచి ప్రగతి సాధిస్తారని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. జైకిషన్ ఓఝా మాట్లాడుతూ సంగీతం ద్వారా ప్రకృతిని కంట్రోల్ చేసే విజ్ఞానం అందుబాటులో ఉందని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర విజ్ఞాన అంశాలలో నిష్ణాతులు కావడానికి ఇలాంటి విస్తరణ ఉపన్యాసాలు సహాయం చేస్తాయని తెలిపారు. కార్యక్రమానికి తెలుగు విభాగం అధ్యక్షురాలు డా. గోలి శ్రీలత, తెలుగు విభాగం సహాయ ఆచార్యులు డా. తన్నీరు సురేష్ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం శ్రీ కొరిడే నరహరిశర్మను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మంజుల, రాజ్ కుమార్ శ్రీనివాస్, సంధ్యారాణి, కవిత, చంద్రశేఖర్, రాంచందర్. నాగేందర్,సతీష్ సుకన్య విద్యార్థినీ, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోని కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలె


- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. నర్సింహ
- రాష్ట్ర 3 వ సభ పోస్టర్ విడుదల

**సికింద్రాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** ప్రభుత్వాసుపత్రుల్లో గత కొన్నేండ్లుగా కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.




నర్సింహా డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభల పోస్టరును శుక్రవారం గాంధీ ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా నర్సింహా మాట్లాడుతూ....గత 20 ఏండ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చాలీచాలనీ జీతాలతో కాంట్రాక్ట్ సిబ్బంది దుర్భర జీవితం గడుపుతున్నారని వాపోయారు. వీరిని పర్మినెంట్ చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈనెల 28 వ తేదిన మహబూబ్ నగర్ లో జరిగే మహాసభకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై వివిద అంశాలపై చర్చించి తీర్మాణాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ యూనియన్ నాయకురాలు ఎస్. కిష్టమ్మ, శోభ, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడులో అంతుచిక్కని నాడి!




మునుగోడు ఉప ఎన్నికలో ఇప్పుడు పరస్పర విమర్శల కారణంగా అసలు సమస్యలు వెనక్కి పోయాయి. ప్రజల సమస్యలను ప్రస్తావించి వాటిని పరిష్కరిస్తామని గట్టిగా చెప్పడంలో అటు అధికార టిఆర్ఎస్,ఇటు బిజెపి,కాంగ్రెస్ పార్టీల నేతలు విఫలం అవుతున్నారు. టిఆర్ఎస్ కేవలం ఫ్లోరైడ్ భూతం గురించి చూపుతూ తామే పరిష్కరించామని, మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించామని చెప్పుకుంటోంది. అయితే ప్రజలకు ఇవేవీ ఆనడం లేదు. వారు కోరుకున్న విధంగా పాలకుల తీరు లేదన్న భావనలో ఉన్నారు. పరస్పర దూషణలతో తెలంగాణ సెంటిమెంట్‌ను ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. ఎన్నికకు ప్రధానకారణమైన రాజగోపా రెడ్డిని, బిజెపిని లక్ష్యంగా చేసుకని అధికార టిఆర్ఎస్ విమర్శలను ఎత్తుకుంది. ఢిల్లీకి గులాంగిరీ చేస్తున్న రాజగోపాల్ దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అదే సమయంలో ఉద్యమకారులను ఎందుకు దూరం పెట్టాల్సి వచ్చిందో చెప్పడం లేదు. స్వీయ అస్తిత్వం, స్వపరిపాలన కోసం తెలంగాణ ప్రజలు ఉద్యమిస్తే.. దానిని హైజాక్ చేసిందెవరో ప్రజలకు తెలియదా? అంటూ ఇప్పుడు కాంగ్రెస్,బిజెపి నాయకులు ఎదురు దాడికి దిగుతున్నారు. ఈ దశలో తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం ఆయన పార్టీని పెట్టి కెసిఆర్‌ను గద్దె దించాలని పిలుపునిస్తున్నారు. తాము చేసిన పనులతో మునుగోడు ప్రాంతం బాగయ్యిందని చెప్పుకోవ డానికి టిఆర్ఎస్ వారికి ఛాన్స్ లేదు. అధికారం లో టిఆర్ఎస్ ఉన్నా కాంగ్రెస్,బిజెపిలు అభివృద్ధికి అడ్డం పడుతున్నాయన్న సొల్లు కబుర్లే వినిపిస్తు న్నాయి. ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం ఉద్యమించి సాధించుకున్న తెలంగాణను మరింత అభివృద్ధి చేయాలంటే రాష్ట్రానికి సింహంలాంటి సీఎం కావాల్నా.. ఢిల్లీకి గులాం గిరీచేసే బిజెపి కావాలా అంటూ మరోవైపు టిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. వివిధ పార్టీల నుంచి క్షేత్రస్థాయిలో కొందరిని చేర్చుకోవడం ద్వారా పరిస్థితి అంతా తమకే అనుకూలమన్న లెవల్లో ప్రచారం చేసుకుంటున్నారు. అధికార పార్టీ పత్రికలు, మీడియా అదేపనిగా ప్రచారం చేస్తూ వాపును బలుపుగా చేస్తున్నాయి. గతంలో ఎప్పుడూ మీడియా ఇంతగా దిగజారిన దాఖలాలు లేవు. కెసిఆర్ సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదన్న విషయంపై కూడా స్పష్టమైన సమాధానం రాదు. పోనీ సమస్యలపై ప్రస్తావిస్తే దాటవేతలు లేదా విమర్శలు ఎక్కువయ్యాయి. తెలంగాణ ఏర్పడ్డది మొదలు ప్రజల పక్షాలన నిలిచి పనులు చేసుకుంటూ పోతే ఇవాళ టిఆర్ఎస్ ఇంతగా ఇతర పార్టీలను విమర్శించా ల్సిన అవసరం ఏర్పడేది కాదు. మంత్రులు, టిఆర్ఎస్ బలగం ఇక్కడే మకాం వేయాల్సిన అవసరం ఏర్పడేది కాదు. ప్రజలను పట్టించుకుని ఉంటే తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన నేతగా కెసిఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలాగే ఆ పార్టీని ప్రజలు విస్మరించేవారూ కాదు. కానీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఇంకా కాంగ్రెస్, బిజెపిలను తిడుతూ,సెంటిమెంట్‌ను రెచ్చగొడితే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు లేదు. ఆరుదశాబ్దాల వివక్ష కారణంగా దెబ్బతిన్న తెలంగాణ ప్రాంతానికి నూతన దిశానిర్దేశం చేయడానికి, చరిత్రలో ఒక విశిష్ట నాయకుడిగా నిలవడానికి వచ్చిన అవకాశాలను కెసిఆర్ తనకు తానుగా చేజార్చు కున్నారు. ఎందరో బలిదానాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా, ఆ విజయం తనదేనని కెసిఆర్ అన్నా ఎవరుకూడా పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. ఒక ఆశయం కోసం సుదీర్ఘపోరాటం జరిపి, దాని విజయాన్ని ప్రజలకు అందించిన ఘనుడు కెసిఆర్ అనడంలో సందేహం లేదు. అయితే సిఎం అయిన తరవాత అధికారాన్ని సంఖ్యా బలాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రజలకు పింఛన్లు, తాయిలాలు ఇస్తూ సాదాసీదా నాయకుడిగా మిగిలి పోయారు. ప్రజలు ఇలాంటి పందేరాలను కోరుకోలేదు.

పనులు చేయాలని ప్రజలు కోరుకున్నారు. హామీలను అమలు చేసి కొత్త తెలంగాణకు తెరతీయాలని చూశారు. నీటిపారుదల, ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఆయన చర్యలు తీసుకున్నా ఎందుకనో పెద్దగా ప్రజల్లో స్పందన కనిపించడంలేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం ఆయన కులవృత్తులకు ఆర్థిక సాయం అందించినా అది ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నం గా కనిపిస్తోంది. ఓటుకునోటు పథకాలు అమలవుతున్నా యన్న భావన ప్రజల్లో ఏర్పడింది. చెరువుల పూడికతీత అంతా ప్రచారంగా సాగింది. మిషన్ భగీరథ కూడా అంతే. ఇక్కడ ఫ్లోరైడ్‌ను తరిమికొట్టామని ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. ఊరూరా మంచినీటిని అందిస్తున్నామని మాత్రమే చెబుతున్నారు. అభివృద్ధి జరగకపోవడానికి రాజగోపాల్‌ను కారణంగా చూపితే ప్రజలు నమ్మరని గుర్తించడం లేదు. అలాగే అదే పనిగా బిజెపిని తిట్టడం వల్ల మైనస్ అవుతుందన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఎదుటి పార్టీలను ఇంకా ఉనిమిదేళ్ల తరవాత కూడా తిడుతూ పోలేం. రోడ్లు, మంచినీరు, కాలువలు, ఉద్యోగ ఉపాధి వంటి అంశాలపై స్పష్టమైన హామీలు ఇవ్వడం లేదు. తానే దత్తత తీసుకుంటానని కెటిఆర్ అన్నంత మాత్రాన ప్రజలు నమ్మరు. ఇలాంటి వాటి ద్వారా లబ్ది పొందాలనుకున్న ప్పుడు పటిష్టంగా కార్యక్రమాలు అమలు చేసి ఉంటే బాగుండేది.

అవేవీ చేయకుండా కేవలం ఎదుటి వారిని తిటటడం ఇప్పుడు రాజకీయ ప్రచరంగా మారింది. అటు విపక్షాలు కూడా ఇదే పనిలో ఉన్నాయి. ఈ విమర్శలతో ఒనగూరే ప్రయోజనం సున్నా. ఇప్పటికైన పార్టీలు ప్రజలకు గట్టిగా హామీలు ఇవ్వాలి. వాటిని నెరవేరుస్తామన్న భరోసా కలిగించాలి. ఫలానా పని చేస్తామని చెప్పగలగాలి. అలా చేయనప్పుడు ఎన్ని తాయిలాలు ప్రకటించినా లాభం లేదు. అందుకే మునుగోడులో ప్రజల నాడి అందడం లేదు. ఎవరు ఏ పార్టీ వైపో..ఎవరికి ఓటేస్తారో కూడా చెప్పలేకపోతున్నారు. అందుకే ఈ ఉప ఎన్నిక ఏ పార్టీకైనా ఓ గగుణపాఠం కావాలి. ప్రజల అవసరాలను గుర్తించి..నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడేందుకు ప్రయత్నం చేయాలి.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, "నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## వింత అలవాటు

చుంచుపల్లి గ్రామంలో చంద్రయ్య, కాంతమ్మ అనే దంపతులుండే వారు. సంతానం కోసం నూటొక్క పుణ్యక్షేత్రాలు తిరిగి ,కోటొక్క దేవ తలకు మొక్కుకున్నారు. ఆయుర్వేదం అల్లోపతి, ఆకు పసర్లు ఒకటేమిటి ఎన్నో సేవించారు. నోముల ఫలమో, వైద్యం ఫలితమో



ఎట్టకేలకు కాంతమ్మ కడుపు పండింది.గుమ్మడి పండులాంటి కొడుకు పుట్టాడు.

కొడుకంటే పంచ ప్రాణాలు ఇద్దరికీ. వాడు ఆడిందే ఆట పాడిందే పాట. కొండమీది కోతి కావాలనగానే క్షణంలో కళ్ళముందు ఉండాలంతే... లేదంటే ఇల్లు పీకి పందిరేసేవాడు.. నానా యాగీ చేసేవాడు.అన్నం తిననని అలిగి కూచునే వాడు. వాడిని బతిలాడి తినిపించే సరికి తాతలు దిగొచ్చేవారు. తల్లి కదా!ఎలాగో వాడి ఆగడాలు భరిస్తున్నది..

కానీ తండ్రి చంద్రయ్యకు కొడుకు గురించి దిగులు పట్టుకున్నది. వాడు బడికి కూడా ఇష్టముంటే వెళ్ళేవాడు. లేదంటే లేదు. టీచర్లు వాడిని మార్చాలని చూసి, తమ వల్ల కాదని తెలుసుకున్నారు. "మొక్కై వంగనిది మానై వంగదని" మీరే సరిచేసుకోవాలి, మీ పిల్లవాడిని" అంటూ తల్లిదండ్రులను పిలిచి చెప్పారు...

ఇదంతా చంద్రయ్యకు చాలా అవమానంగా, బాధగా కూడా అనిపించింది. ఒక్కగానొక్క కొడుకు, వాడి భవిష్యత్తు ఎట్లా, ఏం చేస్తే బాగుపడతాడా అని రోజంతా ఆలోచించాడు. చివరి కొక నిర్ణయానికి వచ్చాడు.

అన్నం తినకుండా యాగీ చేస్తున్న కొడుక్కు నయానా భయానా చెప్పి చూశాడు. ఇక లాభం లేదని గది లోపలికి తీసుకెళ్ళి, తను పెట్టాలనుకున్నది పెట్టాడు."ఏమైనా గొడవ చేశావా? ఊర్కునేదే లేదని బెదిరించాడు. తండ్రి అలాంటిది పెడతాడని ఊహించని వాడు, కిక్కురుమనకుండా బుద్ధిగా అన్నం తిన్నాడు.. అప్పటి నుంచి అదొక అలవాటుగా మారింది.

బడిలో అన్నం తినకుండా "అది కావాలి" అంటూ మారాం చేస్తుంటే చంద్రయ్యను పిలిపించారు. చంద్రయ్య తన కొడుకు భోజనం చేయాలంటే 'నేను పెట్టేది మీరు కూడా పెట్టాలి, లేదంటే తినడని' ఓ సారుకు చెప్పాడు.

అది విన్న సారు మొదట్లో ఆశ్చర్యపోయాడు. వాడు మరుసటి రోజు అలానే మారాం చేస్తుంటే చంద్రయ్య చెప్పినట్టే చేశాడు. అప్పటి వరకు స్నేహితులు వంటవాళ్ళు, మిగిలిన సార్లు ఎంత చెప్పినా తినకుండా అలాగే కూర్చున్న వాడు, చక్కగా తినడం చూశారు. వాళ్ళంతా ఆ సారును 'ఏం చేశారో' చెప్పమని అడిగితే చెప్పలేదు.చంద్రయ్యకు ఇచ్చిన మాట ప్రకారం చెప్పకుండా దాటవేసాడు. వాడే శివుడు. చక్కగా చదువుకొని ఉద్యోగం కూడా సంపాదించాడు. కానీ ఎక్కడికి వెళ్ళినా తండ్రి మాత్రం నీడలా వెంట వెళ్ళాల్సి వచ్చేది.

చంద్రయ్య స్నేహితుడైన రామయ్య ఓ రోజు శివున్ని చూశాడు. శివుడి ఉద్యోగం, వినయ విధేయతలు నచ్చాయి. వెంటనే కూతురు విజయనిచ్చి, అంగరంగ వైభవంగా పెళ్ళి చేశాడు. పెళ్ళికొచ్చిన వారంతా ఈడూ జోడూ చాలా బాగుందని దీవించారు.

***

పెళ్ళి తంతు పూర్తి అయ్యింది.కొత్త దంపతులకు ప్రత్యేకంగా ఓ గదిలో భోజనం పెట్టి, తినమని బయటికి వచ్చారు. విస్తరి వైపు చూస్తూ, ఎంతకూ తినని శివుడిని చూసి ,అలిగాడేమోనని భయపడి, తల్లి దండ్రులకు చెప్పింది. వాళ్ళెంత బతిలాడినా తినలేదు. ఏం కావాలి బాబూ? అంటే "అది కావాలి" అంటాడు కానీ అదేమిటో చెప్పడు..." బండి కావాలా కారు కావాలా.." అని చేంతాడంత లిస్ట్ చదివినా, ఏదీ వద్దని తలూపుతూ, "అది కావాలి" అంటుంటే అతడికి ఏం కావాలో వాళ్ళకు అర్థం కాలేదు. ఇక లాభం లేదనుకుని, పందింట్లో అలసిపోయి నిద్ర పోతున్న చంద్రయ్యను లేపారు. "మీరన్నా తెలుసుకొని చెప్పండి బావగారు "అది కావాలి" అంటాడు ఏమిటో చెప్పట్లేదు అని వియ్యాల వారు వాపోయారు.

ఆ మాటలకు నవ్వు మొహంతో.. "మీరేం బాధ పడకండి" అంటూ కొడుకు శివున్ని ఎవరూ లేని ఓ గదిలోకి తీసికెళ్ళాడు. పెట్టాల్సింది పెట్టి, ఇక ఇలాంటివి మానుకొమ్మని బతిమిలాడాడు.. అయినా సరే "భోజనం చేసే ప్రతి సారి అదే తంతు. తండ్రి రావడం వేరే గదిలోకి తీసికెళ్ళి, తీసుకొని రావడం. ఆ తర్వాతే వాళ్ళు పెట్టింది తినడం." ఇదంతా చిత్రంగా అనిపించింది .అస్సలు విషయం ఏమిటో అంతు పట్టలేదు.

ముఖ్యంగా పెళ్ళి కూతురు విజయ ఈ రహస్యమేమిటో తెలుసుకోవాలనుకుంది. భోజనం తినకుండా అలాగే కూర్చున్న భర్తను, మామగారొచ్చి, గదిలోకి తీసికెళ్ళడం గమనించింది. శివుడు తనకు ప్రేమగా కొనిచ్చిన సెల్ ఫోన్ తీసికెళ్ళి వీడియో ఆన్ చేసి ఆ గదిలో ఎవరు చూడకుండా పెట్టి వచ్చింది. ఆ తర్వాత వీడియో చూసి ముక్కు మీద వేలేసుకుంది.. ఓర్నీ"ఇది కావాలా! ఈయనకు "అనుకుంటూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకుంది..

***

మరుసటి రోజు భోజనానికి ముందు"అది కావాలి" అంటారుగా! నేను పెడతా రండి" అంటూ గదిలోకి తీసికెళుతున్న కోడల్ని చూసి అవాక్కయ్యాడు చంద్రయ్య. ఇంతకాలం ఎవరికీ తెలియకుండా దాచిపెట్టిన విషయం కోడలుకెలా తెలిసిందాని అడిగితే చెప్పింది.

ఆ తర్వాత కోడలితో " వాళ్ళ అమ్మ అతి గారాబంతో వాడలా అయ్యాడు, అన్నం తిననని మారాం చేసేవాడు. అందుకే ఓ రోజు కోపం వచ్చి "తొడపాశం" పెట్టి బెదిరించాను. కిక్కురుమనకుండా తిన్నాడు. అప్పటి నుండి వాడికిలా అలవాటైందని." చెప్పి బాధ పడ్డాడు.

-పురిమళ్ల సునంద, ఖమ్మం

94418 15722

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

## అక్టోబర్ 22... కొమురం భీం జయంతి సందర్భంగా

ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం. గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.



కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు,తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.

మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు.

ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం



-ఆర్కె సంగనభట్ల

9440595494

# ప్రపంచంలోనే అత్యంత అస్థిరమైన నగరాలు

**జాబితాలో ఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్‌లకు చోటు**

**ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ సంస్థ అధ్యయనం**

**న్యూఢిల్లీ,అక్టోబర్21:** ఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్‌లు ప్రపంచంలోనే అత్యంత అస్థిరమైన నగరాల జాబితాలో చేరాయి. ఈ నగరాలు తక్కువ ఆదాయం, తక్కువ భద్రత కలిగి ఉన్నాయని.. దీంతో జనాభా పెరుగుదలను తట్టుకునే ఆర్థిక సామర్థ్యం ఉండదని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ ఐఇపి అనే అధ్యయన సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో ఈ నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన మెరుగు పరచడం, నేరాలను తగ్గించడం, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వకపోవడం వంటివి తలెత్తవచ్చు. అధిక స్థాయిలో వాయు కాలుష్యం, నీటి ఒత్తిడి మరియు పర్యావరణ విపత్తులను ఎదుర్కోవచ్చని ఐఇపి స్థాపకుడు స్టీవ్ హెచ్చరించారు. ఈ విపత్తుల నుండి ఆశ్రయం, స్థిరత్వం కోసం పోరాటాలు జరగవచ్చని, మౌలిక సదుపా యాలు, ఉద్యోగ భద్రత, సేవల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెరగవచ్చని హెచ్చరించారు. గ్రామాలు, ఇతర ప్రాంతాల నుండి ఉపాధికోసం నగరాలకు వలసలు పెరిగిపోతున్నాయి. ఈ శతాబ్దం మధ్యనాటికి సుమారు వెయ్యికోట్లకు పైగా ప్రజలు ఉపాధి కోసం నగరాలకు చేరుకోవచ్చని అంచనా. దీంతో ప్రపంచంలో ఇప్పుడు ఉన్న నగరాలతో పాటు మరో 14 కొత్త నగరాలను విస్తరించాల్సిరావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో 2050 నాటికి జనాభా 10లక్షలు దాటవచ్చని, దీంతో 33 మెగాసిటీలను




విస్తరించాల్సి రావచ్చని అన్నారు. పర్యావరణ విపత్తులు, సామాజిక అస్థిరత పెరిగిపోవడంతో పాటు పట్టణీకరణ వేగవంతమవుతుందని ఐఇపి సంస్థ పేర్కొంది. ముఖ్యంగా ఆఫ్రికాలోని సబ్‌సహరాన్ రీజియన్‌ల్లోని రాష్ట్రాలతో పాటు దక్షిణ ఆసియా దేశాల్లోని సుమారు ఎనిమిది రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయని పేర్కొంది. బంగ్లాదేశ్‌లోని ఢాకా, పాకిస్తాన్‌లోని లాహోర్, భారత్‌లో కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్‌లు ఉన్నాయి. ఈ నగరాల్లో జనాభా పెరుగుదల 50శాతంగా ఉంటుందని అంచనా. అలాగే కాంగోలోని కిన్షాసా, నైరోబి, కెన్యా లాగోస్, నైజీరియా ఈ మెట్రో ప్రాంతాల్లో జనాభా కనీసం 80 శాతం పెరగవచ్చని అంచనా.

# ఖర్గేకు కాంగ్రెస్‌లో అంతా మద్దతు ఇచ్చారు

## శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,అక్టోబర్21:** ఇటీవల కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి, ఓడిపోయిన ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఓడి పోయినందుకు బాధపడడం లేదని స్పష్టం చేశారు. అయినా ముందు నుంచీ ఖర్గేకు పార్టీ మద్దతు ఇస్తోందన్న ఆయన.. అందులో తనకు తప్పేమీ కనిపించలేదని చెప్పారు. అయినా జీవితంలో ఇలాంటి గెలు పోటములు సహజమేనని చెప్పుకొచ్చారు. పార్టీ ముందు ఒకలా, మీడియా ముందు మరోలాగా శశి థరూర్ వ్యవహరిస్తున్నారంటూ ఇటీవల ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మధుసూధన్ మిస్త్రీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలకు సమాధానంగా శశి థరూర్ తాజాగా బదులిచ్చారు. పార్టీలోని చాలా మంది సభ్యులు తమకు మద్దతు ఇవ్వడంలో ఆశ్చర్యమేమీ లేదని శశి థరూర్ చెప్పారు. అయితే ముందు నుంచే పార్టీలోని చాలా మంది ఖర్గేకు సపోర్ట్ చేస్తున్న విషయం తెలిసిందేనని, అయినా దాంట్లో తప్పేం కనిపించలేదని తెలిపారు. రిజల్ట్ అనంతరం తాను సోనియా గాంధీతోనూ మాట్లాడానని స్పష్టం చేశారు. ఖర్గేకు శుభాకాంక్షలు కూడా తెలియజేశానన్నారు. ఇదిలా ఉండగా 24ఏళ్ల తర్వాత మొదటిసారి జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో మల్లిఖార్జున ఖర్గే విజయం సాధించారు. ఖర్గేకు 7,897 ఓట్లు రాగా, శశి థరూర్ కు 1072 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన ఖర్గే అక్టోబర్ 26న బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే ఆయన తన ట్విట్టర్ అకౌంట్ బయోలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ అని చేర్చారు.



# గ్రామాల్లో నేతలకు సెగ

## సమస్యలపై రఘునందన్‌రావు నిలదీత

**నల్లగొండ,అక్టోబర్21:** ఎన్నికల తేదీ సమీపిస్తున్నకొద్దీ మునుగోడులో రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. రాజకీయ పార్టీలు తమ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. అయితే నియోజకవర్గంలో అక్కడక్కడా బీజేపీకి నిరసనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రచారంలో భాగంగా గ్రామాలకు వెళ్లిన ఆ పార్టీ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డిని ప్రజలు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీస్తున్నారు. ఏ మొహం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నావని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తాజాగా పార్టీ అభ్యర్థి తరఫున సంస్థాన్ నారాయణపురంలో ప్రచారం నిర్వహిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావుకు ఇదే అనుభవం ఎదురయింది. మండలంలోని లింగవారిగూడెంలో రఘునందన్ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అయితే గ్రామ ప్రజల నుంచి ఎమ్మెల్యేకు నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. తమ ఊర్లో ప్రచారం చేయడానికి వీల్లేదని తెగేసి చెప్పారు. దీంతో చేసేందేం లేక రఘునందన్ రావు వెనుతిరిగారు.

# పత్తిధరలతో రైతులు ఆందోళన

### రోజురోజుకు తగ్గుతున్న ధరలు

ఆదిలాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులు కనీస మద్దతు ధరకు నోచుకోవడం లేదు. రకరకాల షరతులు పెడుతూ వ్యాపారులు ధర తగ్గించి కొంటున్నారని రైతులు వాపోతున్నారు. ప్రశ్నించే వారు లేరన్నట్లు రోజు రోజుకూ ధర తగ్గిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 14వ తేదీన క్వింటం పత్తికి కనీస మద్దతు ధర 8,300 రూపాయలు పలుకగా.. తాజాగా పత్తి కనీస మద్దతు ధర క్వింటాలుకి రూ. 7850కు తగ్గించారు. కేవలం వారం రోజుల్లో క్వింటాలుకి రూ.500 తగ్గించారని రైతులు ఆరోపించారు. రైతులు మార్కెట్ కు తెచ్చిన పత్తి పంటలో ఏమాత్రం క్వాలిటీ లేదని సాకులు చెబుతున్నారని.. తేమశాతం 8 నుండి 12శాతం వరకు మాత్రమే ఉన్న పత్తిని కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# పోలీస్ వృత్తి ఒత్తిడితో కూడుకున్నది

### అమరులకు నివాళి అర్పించిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,అక్టోబర్21: పోలీసు వృత్తి అనేక ఒత్తిడిలతో కూడుకున్నదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వృత్తిధర్మం కోసం కుటుంబాలను కూడా లెక్కచేయకుండా పోలీసులు పనిచేస్తున్నారని చెప్పారు. వరంగల్‌లోని పోలీస్ పరేడ్



గ్రౌండ్‌లో జరిగిన పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరులకు నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం చట్టాన్ని అమలు చేస్తూ, సమాజాన్ని సక్రమ మార్గంలో పెడుతున్నది పోలీసులేనని చెప్పారు. కర్తవ్య నిర్వహణలో కొందరు తమ ప్రాణాలను కోల్పోవడం బాధాకరమని, వారి త్యాగాలు గొప్పవన్నారు. పోలీసు అమరుల కుటుంబాలను సరైన రీతిలో ఆదరించడం, గౌరవించుకోవడం మన విధి అని చెప్పారు. తాను రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఈ కార్యక్రమంలో క్రమంతప్పకుండా పాల్గొంటున్నాని తెలిపారు.

# డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్తీపన్‌పై వేటు

### చిన్నారిపై అత్యాచారం కేసులో చర్యలు

హైదరాబాద్,అక్టోబర్21: డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్తీపన్‌పై వేటు పడింది. చిన్నారిపై అత్యాచార ఘటనకు బాధ్యుడిని చేస్తూ.. పార్తీపన్‌ను విధుల నుంచి డీఏవీ యాజమాన్యం తొలగించింది. ఘటన జరిగిన మరుసటి రోజు నుంచి.. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఉన్న మాధవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై ఢిల్లీ నుంచి డీఏవీ స్కూల్ ఇంటర్నల్ కమిటీ విచారణ నిర్వహించింది. ఇదిలావుంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ని డీఏవీ స్కూల్ అత్యాచార బాధిత చిన్నారి తల్లిదండ్రులు శుక్రవారం కలిశారు. స్కూల్ యాజమాన్యం, బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారిపై పైశాచిక చర్యకు పాల్పడిన వారికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈ క్రమంలో సీవీ ఆనంద్‌తో రేవంత్ ఫోన్‌లో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి తప్పక న్యాయం జరిగేలా చూస్తానని చిన్నారి తల్లిదండ్రులకు రేవంత్ హామీ ఇచ్చారు.

# రాజగోపాల్‌ను ఓడించడం ఖాయం

### ప్రచారంలో ఎమ్మెల్యే బాల్కసుమన్

నల్లగొండ,అక్టోబర్21: మునుగోడు ప్రజలు రాజగోపాల్ రెడ్డిని ఓడించడం ఖాయమని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ప్రచారానికి వెళ్లిన ప్రతిచోట ప్రజలు ఆయనను నిలదీస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో బీజేపీ డబ్బులు



ఏరులై పారిస్తున్నదని ఆరోపించారు. ప్రధాని మోదీ చర్యల వల్ల దేశం నాశనమవుతున్నదని విమర్శించారు. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పెట్టగానే బీజేపీ వాళ్ల కాళ్ల కింద మట్టి కదులుతున్నదని, పీఠాలు వణుకుతున్నాయని పేర్కొన్నారు. అందుకే మునుగోడులో కుట్ర చేసి ఉపఎన్నిక తీసుకొచ్చారన్నారు. చండూరులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. మునుగోడులో కాషాయ పార్టీకి స్పందన కరువైందన్నారు. దర్యాప్తు సంస్థలను కూడా బీజేపీ నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కుట్ర పన్ని కారు గుర్తు పోలిన గుర్తును ఈవీఎంలో చేర్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణపై బీజేపీ కక్ష సాధిస్తున్నదని చెప్పారు. విభజన చట్టం హామీలను బీజేపీ అమలు చేయడంలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో బీజేపీ నాయకులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఉద్యమ సందర్భంగా తెలంగాణ కోసం రాజీనామా చేయకుండా కిషన్‌రెడ్డి పారిపోయాడని విమర్శించారు. కేంద్రంలో 16 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ మోదీ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని చెప్పారు. మునుగోడులో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్లను గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్‌ను కట్టడి చేయాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చే బీజేపీ నాయకులు మునుగోడుకు ఏంచేశారో చెప్పి ఓట్లు అడగాలని హితవుపలికారు. ఎన్నికల సంఘం నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు. బీజేపీ నాయకులు విచ్చలవిడిగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని, వాటిపై ఈసీ దృష్టి పెట్టాలని కోరారు.

# విక్టోరియా మెమోరియల్ భూ కబ్జాకు యత్నాలు

### ఎమ్మెల్యే సుధీర్ పాత్రపై పూర్వ విద్యార్థి సంఘాల ఆగ్రహం

హైదరాబాద్,అక్టోబర్21: విక్టోరియా మెమోరియల్ హోం గ్రౌండ్ భూ వివాదం కొనసాగుతోంది. ప్రైవేట్ వ్యక్తులు, పోలీసు ఉద్యోగ అభ్యర్థుల కోసం ప్రత్యేక ట్రాక్ ఏర్పాటుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చొరవ చూపడంపై పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీఎం హోం ట్రస్ట్ పూర్తిగా అనాథ విద్యార్థులకు సంబంధించినదని, దాని భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అంటున్నారు. ఈ భూముల్లో ఏం చేయాలన్నా ట్రస్ట్ ఛైర్మన్, కమిటీని సంప్రదించాలని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు వీఎం హోం విద్యార్థులపై చెయ్యి చేసుకోవడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. వేలాది మంది పోలీసు ఉద్యోగార్థులు ప్రాక్టీస్ కోసం గ్రౌండ్ కు వస్తే తమ విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుందని అంటున్నారు. ప్రాక్టీస్‌కు ప్రత్యామ్నాయ స్థలాలు చూసుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే వీఎం ఘటనపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందించారు. నిరుపయోగంగా ఉన్న వీఎం హోం స్థలాన్ని చదును చేసి.. కేవలం 45 రోజులు పోలీసు ఉద్యోగార్థులు ప్రాక్టీస్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ ను కోరారు. ట్రస్ట్ ఛైర్మన్ గా ఉన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ కు వీఎం హోం భూముల్లో జేసీబీలతో వర్క్ చేస్తున్నట్లు సూపరింటెండెంట్ లక్ష్మీ పార్వతి తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. పూర్వ విద్యార్థులతో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు.

# తమిళనాట ట్రాఫిక్ చక్కదిద్దే పనిలో పోలీసులు

### ట్రాఫిక్ ఉల్లంఘనలకు భారీ జరిమాన

చెన్నై,అక్టోబర్21(ప్రజామంటలు): ట్రాఫిక్ ఉల్లంఘనలపై తమిళనాడు ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. రోజురోజుకి పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు.. రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం కఠిన చర్యలు చేపట్టింది. మోటారు వాహనాల చట్టంలో కేంద్రం చేసిన సవరణల



మేరకు.. తమిళనాడులో కొత్త రోడ్డు భద్రతా నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ట్రాఫిక్ ఉల్లంఘనలకు స్పాట్‌ఫైన్లు విధించాలని నిర్ణయించింది. అంబులెన్స్‌కు దారివ్వకుండా, హారన్ మోగిస్తూ వేగంగా వాహనాలను నడిపితే రూ.10 వేల జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే రోడ్లపై పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడిపేవారికి తొలిసారి రూ.2 వేలు, రెండోసారి రూ.10వేలు జరిమానా విధిస్తామని వివరించారు. వాహనాలను నడిపేందుకు అర్హత లేని వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు వాహనం నడిపితే తొలిసారి రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.2000 ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది. సక్రమంగా రిజిస్ట్రేషన్ నెంబర్లు లేకుండా వాహనాలు నడిపేవారికి రూ.2500, రెండోసారి పట్టుబడితే రూ.5000 చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కార్లు తదితర వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటిసారి రూ.5000, రెండోసారి పట్టుబడితే రూ.10వేలు జరిమానా వసూలు చేస్తారు.

# బిజెపి భయంతో కెసిఆర్ దిగిరాక తప్పలేదు

### ఓ గ్రామానికి ఇన్‌ఛార్జ్‌గా కెసిఆర్ రాకపై కిషన్ రెడ్డి

నల్లగొండ,అక్టోబర్21(ప్రజామంటలు): బీజేపీ భయం వల్లనే సీఎం కేసీఆర్ మునుగోడులోని ఒక గ్రామానికి ఇంచార్జ్‌గా మారాడని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రభుత్వ కార్యక్రమాలను ఆపేసి..



మునుగోడులోనే మకాం వేశారని విమర్శించారు. వందల కోట్లు ఖర్చు పెట్టిన హుజురాబాద్, దుబ్బాకలో టీఆర్ఎస్ గెలవలేదన్నారు. మార్కెట్‌లో గొర్రెలను కొన్నట్టుగా టీఆర్ఎస్.. ఇతర పార్టీల నేతలను కొంటున్నారని కానీ మునుగోడు ఓటర్లు అలా అమ్ముడుపోరని వ్యాఖ్యానించారు.

మునుగోడు మండలం చల్మెడ గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ కుటుంబానికి మంత్రులు, ఎమ్మెల్యేలు బానిసలుగా మారారని కిషన్ రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లాలో ఎలోరైడ్ నిర్మూలన కోసం కేంద్రం 800 కోట్లు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో అసైన్డ్, బంజరు భూములు కనిపిస్తే టీఆర్ఎస్ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బతికున్న వారికి సమాధులు కట్టడం టీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.



ప్రజాస్వామ్యాన్ని టీఆర్ఎస్ బొందపెట్టాలనుకుంటే..కేంద్ర ఎన్నికల సంఘం కాపాడిందన్నారు. అధికారులు టీఆర్ఎస్ ఒత్తిడికి తలొగ్గితే తిప్పలు తప్పవని కిషన్ రెడ్డి హెచ్చరించారు. ఎనిమిదేళ్లుగా సచివాలయానికి వెళ్లని ఏకైక సీఎం.. కేసీఆర్ మాత్రమేనని విమర్శించారు.

రాష్టంలో జరిగే అన్ని అక్రమాలకు ప్రగతి భవన్ అడ్డాగా మారిందన్నారు. రాష్టంలో భూములను వదిలి పెట్టడంలేదని.. బీజేపీ వచ్చాక అవన్నీ కక్కిస్తామన్నారు. పార్టీ గెలుపుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అబద్దాల ప్రచారంలో బిజెపి నేతలు దిట్ట

### మునుగోడులో బిజెపివన్నీ విషప్రచారాలు

### కెసిఆర్‌ను చూస్తే బిజెపిలో వణుకు

### మీడియా సమావేశంలో మండిపడ్డ ఎర్రబెల్లి

నల్లగొండ,అక్టోబర్21: మునుగోడు ప్రచారంలో బిజెపి నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఫైరయ్యారు. మునుగోడు ఉపఎన్నికల్లో బీజేపీకి ఓట్లడిగే హక్కు లేదని మంత్రి చెప్పారు. సీఎం కేసీఆర్‌ను చూస్తే బీజేపీ నేతల వెన్నులో వణుకుపుడుతున్నదని వెల్లడించారు. కేసీఆర్‌ను నిలువరించే శక్తి ఎవ్వరికీ లేదన్నారు. బిజెపి నేతలు మునుగోడుకు వచ్చి పచ్చి అబద్దాలు మాట్లాడుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై నోరు అదుపులోపెట్టుకుని మాట్లాడాలని సూచించారు. చండూరులో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌తో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతలు డబ్బు మదంతో మునుగోడు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. మునుగోడు ప్రజలు చైతన్యవంతులని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆలోచించి ఓట్లు వేయాలన్నారు.మునుగోడులో సీఎం కేసీఆర్ ఎ÷–లోరైడ్‌ను రూపుమాపారని వెల్లడించారు. అభివృద్ధి చేశాం కాబట్టే తాము ప్రజలను ఓట్లడుగుతున్నామని చెప్పారు. గత ఉపఎన్నికల్లో గెలిచిన నాగార్జునసాగర్, హుజూర్‌నగర్‌లో ఊహకందని విధంగా అభివృద్ధి చేశామన్నారు. కావాలంటే బీజేపీ నాయకులు అక్కడికి వెళ్లి చూడాలన్నారు. జీహెచ్ఎంసీ, దుబ్బాక, హుజూరాబాద్ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ప్రజలను బీజేపీ మోసం చేసిందన్నారు. చౌటుప్పల్‌లో ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్న జేపీ నడ్డా హామీ ఏమైందని నిలదీశారు. 8 ఏండ్లుగా బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏమిచ్చిందని మంత్రి ఎర్రబెల్లి ప్రశ్నించారు. విభజన చట్టం హామీలు నిలపెట్టుకోలేదని, 170 మెడికల్ కాలేజీలు వచ్చినా తెలంగాణకు ఇవ్వలేదని ఆరోపించారు. మునుగోడుని కేటీఆర్ దత్తత తీసుకుంటే మీకేం నొప్పి అంటూ ఎర్రబెల్లి.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లని నిలదీశారు. కేసీఆర్ నాగార్జున సాగర్ దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నాడన్న ఆయన.. దుబ్బాక హుజురాబాద్‌లో గెలిచి కేంద్రం నుండి



ఏం నిధులు తీసుకు వచ్చారన్నారు.హైదరాబాద్ వరదలలో నష్టపోయిన వారిని ఆదుకుంటామని మోసం చేశారని ఎర్రబెల్లి ఆరోపించారు. 2016 లో చౌటుప్పల్‌లో రీసెర్చ్ కేంద్రం పెడతానన్నారని.. మర్రిగూడలో 300 పడకల హస్పిటల్ పెడతానన్నారు.. కానీ అదీ లేదని విమర్శించారు. ఫ్లోరైడ్ బాధితులకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పినా, అదీ చేయలేదని ఎర్రబెల్లి చెప్పారు. మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ లేకుండా చేసింది కేసీఆర్ అని కేంద్ర జలవనరుల మంత్రి మెచ్చుకున్నారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. 8 వేల 80 లక్షల కోట్లు ప్రతి నెలా పెన్షన్ ఇస్తున్నామని, కళ్యాణ్ లక్ష్మీ పేరుతో రూ.7 కోట్లు ఇస్తున్నామని చెప్పారు. కేంద్రం నుండి 18 వేల కోట్లు మునుగోడికి ఇవ్వండి అప్పుడు ప్రజలు నమ్ముతరని తెలిపారు. మునుగోడు ఎన్నికల్లో అమ్ముడుపోయినట్టు ప్రజలకు అర్థం అయిందన్న ఆయన...ఇద్దరు అన్నదమ్ముల్ల వల్ల మునుగోడు అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. బండి సంజయ్ గొర్రెల డబ్బులు సీజ్ చేయమని ఎన్నికల కమిషన్ కు లేఖ రాసినట్లు నిరూపించే దమ్ముందా అని సవాల్ విసిరారు.

# బిజెపిని వీడడం లేదు

### మళ్లీ టిఆర్ఎస్‌లో చేరాలన్న ఆలోచన లేదు

### సిహెచ్ విఠల్, ఏనుగు రవీందర్‌ల స్పందన

హైదరాబాద్,అక్టోబర్21(ప్రజామంటలు): తాను టీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు వస్తోన్న వార్తలపై బీజేపీ నేత సీహెచ్ విఠల్ స్పందించారు. 'టీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి, ఇది పూర్తిగా తప్పుడు వార్త. దయచేసి ఇలాంటి ఫేక్ న్యూస్ సర్క్యులేట్ చేయకండి. నేను నైతిక రాజకీయ విలువలకు కట్టుబడి ఉన్నాను. నైతిక విలువలతో బీజేపీలో చేరాను. ఎవరూ నన్ను కొనుగోలు చేయరు. నా చివరి శ్వాస వరకు బీజేపీలోనే ఉంటాను' అంటూ విఠల్ ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. 2014 నుండి 2021 వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా ఉన్న విఠల్... 2021 డిసెంబర్‌లో బీజేపీలో చేరారు. అటు పార్టీ మార్పు పై మరో బీజేపీ లీడర్ ఏనుగు రవీందర్ రెడ్డి స్పందించారు. బీజేపీని వీడి టీఆర్ఎస్‌లోకి వెళు తున్నానని వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. తాను బీజేపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. మునుగోడు ఉప ఎన్నిక దగ్గర పడుతున్న సమయంలో ఓడిపోతామనే భయంతోనే కేసీఆర్, కేటీఆర్.. ఇలాంటి ప్రచారాలు చేయి స్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్‌లో ఉద్యమ ద్రోహులు మంత్రులుగా ఉన్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ఒక్కొక్కరిని పార్టీ నుంచి వెళ్లగొట్టారని చెప్పారు. టీఆర్ఎస్ లో ఉన్న ఉద్యమకారులను కావాలనే బొంద పెట్టారని అన్నారు. టీఆర్ఎస్ నైతిక విలువలు లేవని తాము గ్రహించే పార్టీని వీడి బీజేపీలో చేరామన్నారు.

# టిఆర్ఎస్‌వి నీచ రాజకీయాలు

### నడ్డాకు సమాధి కట్టడంపై లక్ష్మణ్ ఆగ్రహం

హైదరాబాద్,అక్టోబర్21: టీఆర్ఎస్ నీచ రాజకీయాలు చేస్తోందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... జేపీ నడ్డా కు సమాధి కట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. బ్రతికి ఉండగా సమాధి కట్టి ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలిచారని ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. కేసీఆర్ కు సమాధి కట్టి రాజకీయాలు చేయాలన్న కుసంస్కారం తమకు లేదని తెలిపారు. ట్విట్టర్ టిల్లు దీనిపై ఎందుకు స్పందించడం లేదంటూ యెద్దేవా చేశారు. మునుగోడు ప్రజలు మంత్రులు, ఎమ్మెల్యేల మొహాలపై ఊస్తున్నారన్నారు. ఉద్యమకారులంతా టీఆర్ఎస్‌ను వదిలేసి బీజేపీలో చేరుతున్నారని అన్నారు. టీఆర్ఎస్‌తో ఉన్నది ఉద్యమద్రోహులు మాత్రమే అని తెలిపారు. మునుగోడు ఉపఎన్నిక ఉద్యమ కారులకు... ఉద్యమద్రోహులకు జరుగుతోన్న ఎన్నిక అని స్పష్టం చేశారు. జేపీ నడ్డా ఎపిసోడ్‌పై కేసీఆర్ ఖచ్చితంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సక్రమంగా పరీక్షలు నిర్వహించ లేని దుస్థితిలో టీఆర్ఎస్ సర్కారు ఉందని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం శివారు జాతీయ రహదారి పక్కన ఫ్లోరైడ్ పరి శోధనా కేంద్రానికి కేటాయించిన స్థలంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సమాధి కట్టారు. ఈ వ్యవహారంపై బీజేపీ శ్రేణులు తీవ్రస్థాయిలో మండ పడ్డారు. ఇదిలావుంటే బీజేపీలో రోజురోజుకూ సినీ గ్లామర్ పెరగుతోంది. బీజేపీ ఎంపీ లక్ష్మణ్‌ను సినీనటి దివ్యవాణి తాజాగా కలిసింది. త్వరలో దివ్యవాణి కాషాయ కండువా కప్పుకోను న్నారు. గతంలోనే దివ్యవాణిని చేరికల కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ బీజేపీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే బీజేపీలో విజయ శాంతి, జీవిత యాక్టివ్‌గా ఉన్నారు. ఇక వీరికి దివ్యవాణి కూడా తోడైతే బీజేపీకి మరింత సినీ గ్లామర్ తోడు కానుంది. ఇప్పటికే విజయశాంతి,జీవితలు చురుకుగా ఉన్నారు.

# హాట్ స్ప్రింగ్స్ వద్ద ఘనంగా నివాళి

### పోలీసుల త్యాగాలను స్మరించుకున్న దేశం

న్యూఢిల్లీ,అక్టోబర్21: దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం పరిపాటి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా పోలీసు అమరుకలు నివాళి అర్పించారు. వారి సేవలను స్మరించుకున్నారు. మిలటరీ ఎత్తుగడలకు చైనా సరిహద్దులోని భారత భూభాగాలైన లడఖ్, సియాచిన్ ప్రాంతాలు కీలకమైనవి. సరిహద్దు భద్రతాదళం, ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ వంటి ప్రత్యేక భద్రతాదళాలు ఏర్పడక ముందు సరిహద్దులను రక్షించే మహత్తర బాధ్యతను కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ సీఆర్పీఎఫ్ బలగాలు నిర్వర్తించేవన్నారు. 1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా, చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది. ఆ పోరాటంలో పదిమంది భారత జవాన్లు అమరులయ్యారు. 'హాట్ స్ప్రింగ్స్ అంటే వేడి నీటిబుగ్గ అని అర్థం అని, కానీ భారత జవాన్ల రక్తంతో తడిచిన 'హాట్ స్ప్రింగ్స్ ' నెత్తుటి బుగ్గగా మారి పవిత్ర స్థలంగా రూపు దిద్దుకుంది. ప్రతీ ఏడాదీ అన్ని రాష్ట్రాలపోలీసులతో కూడిన బృందం ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులు అర్పించడం ఆనవాయితీగా వస్తోందిన పోలీసు ఉన్నతాధికారులు అన్నారు.

# ఇంజనీరింగ్ ఫీజుల పెంపు

### ప్రగతిభవన్ ముట్టడికి ఎబివిపి యత్నం

హైదరాబాద్,అక్టోబర్21(ప్రజామంటలు): ఇంజనీరింగ్ ఫీజుల పెంపుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణం వాటిని తగ్గిం చాలని, లేకుంటే పేద విద్యార్థులకు భారం కానుందని తెలిపాయి. ఈ క్రమంలో ఏబీవీపీ కార్యకర్తల ప్రగతి భవన్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. రాష్ట్రంలో ఇంజనీరింగ్ ఫీజుల పెంపును నిరసిస్తూ ఏబీవీపీ ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. అక్కడకు చేరుకున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రగతి భవన్ వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉంటే ప్రగతి భవన్ వద్ద పోలీసులు అత్యుత్సాహం చూపారు. ముట్టడించేందుకు ప్రయ త్నించిన ఏబీవీపీ కార్యకర్తలపై ప్రతాపం చూపారు. అదుపులోకి తీసుకున్న విద్యార్థి నాయకులను డీసీఎం, జీపులోకి తోసి నొక్కిపెట్టారు. ఈ క్రమంలో పలువురు విద్యార్థి నాయకులకు గాయాలయ్యాయి.

# ప్రశాంత్ కిషోర్ ఏదైనా మాట్లాడగలడు

### పబ్లిసిటీ పిచ్చిలో ఉన్నాడు: నితీశ్ సెటైర్లు

పట్నా,అక్టోబర్21(ప్రజామంటలు): రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌పై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నితీశ్ కుమార్ ఇప్పటికీ బీజేపీతో టచ్‌లో ఉన్నాడని ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. పీకే తన పబ్లిసిటీ కోసం నోటికొచ్చిన వ్యాఖ్యలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఆయన తన ఇష్టం వచ్చిన వ్యాఖ్యలు చేసుకోవచ్చని, తాము మాత్రం వాటిని లెక్క చేయమని అన్నారు. ప్రస్తుతం ప్రశాంత్ కిషోర్ వయసు మీద ఉన్నాడని, కాబట్టి ఏదైనా మాట్లాడగలడని నితీశ్ నవ్వుతూ చమత్కరించారు. ఒకప్పుడు పీకే అంటే తనకు మంచి గౌరవ భావం ఉండేదని చెప్పారు. తాను అతడికి గౌరవం ఇచ్చినా అతడు మాత్రం తనను అగౌరవ పర్చాడని నితీశ్ కుమార్ ఆరోపించారు.

# చిరుత చర్మం విక్రయానికి యత్నం

### ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి,అక్టోబర్21(ప్రజామంటలు): చిరుత పులిని చంపడంతో పాటు దాని చర్మాన్ని విక్రయించేందుకు యత్నించిన ఆరుగురిని మహాదేవపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఎస్ సురేందర్‌రెడ్డి వివ రాలను వెల్లడించారు. జిల్లాలో అటవి, పోలీస్ శాఖ సమన్వయంతో వన్య ప్రాణుల రక్షణ కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. దీంట్లో భాగంగా పోలీసులకు అందిన సమాచారం మేరకు చిరుతపులి చర్మాన్ని మహా రాష్ట్రలో విక్రయించేందుకు మహాదేవపూర్ ప్రాంతానికి వస్తున్న ముఠాను పట్టుకోవడానికి డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఆరుగురు సభ్యులు గల ముఠా మహాదేవ పూర్ ప్రాంతానికి రాగానే వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో ఉన్న చిరుతపులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం, ములుగు, ఈస్ట్‌గోదావరి జిల్లాలకు చెందిన ఇరుప నాగేంద్రబాబు అలియస్ చంటి, పొలం వెంకటేశ్, పరిసబోయిన రాజేశ్, ఎర్రగట్ల శ్రీకాంత్, బుర్రి సాయికిరణ్, బొమ్మకంటి కిశోర్ అనే ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే వివేకానంద గౌడ్‌తో ముదిరాజ్ నేతల భేటి

### వినతిపత్రం అందజేత

**సికింద్రాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ తో శుక్రవారం రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘ నాయకులు భేటి అయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముదిరాజ్ నాయకులు



ఆయన్ని శాలువాతో సత్కరించి, కేకును కట్ చేశారు. ఈసందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ..అసెంబ్లీ సమావేశాల్లో ముదిరాజ్ ల సమస్యలపై గళమెత్తే ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ తమ సామాజిక వర్గానికి శ్రేయోబిలాషులని అభినందించారు. ముదిరాజ్ ల సమస్యలపై ఒక వినతిపత్రాన్ని ఈసందర్భంగా వారు ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కు అందచేశారు. కార్యక్రమంలో ఆలిండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సురేశ్ ముదిరాజ్, నాయకులు రామకృష్ణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## తపస్ జిల్లా అధ్యక్షుడు దేవయ్యకు సన్మానం

**జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజామంటలు):** తెలంగాణ ఉపాధ్యాయ సంఘం తపస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోనగిరి దేవయ్య ను




భారత సురక్ష సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక టీఎన్జీవో భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భారత్ సురక్షా సమితి ప్రతినిధులు దేవయ్య ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న దేవయ్య ఉపాధ్యాయ సంఘంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్. ఎస్. నాయకులు ఏసిఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం, ఖుర్షీద్, పోచమల్లు, సింగం గంగాధర్, వనమాల సత్యనారాయణ, మురళి, నరేందుల శ్రీనివాస్, బిజెపి జిల్లా నాయకురాలు, మాజీ కౌన్సిలర్ అరవ లక్ష్మి,రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఏకేవిఆర్ కళాశాలలో

# గ్రీన్ దీపావళి వేడుకలు

**భీమదేవరపల్లి అక్టోబర్ 21 (ప్రజామంటలు):** ములకనూరులోని ఏకేవిఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలోఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రీన్ దీపావళి ఉత్సవాలను




నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ కాలుష్యం లేకుండా దీపావళి పండుగ జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్ల కుమారస్వామి, చిట్యాల నరేష్, లలిత, సుప్రియ, అరుణ, రాజు, ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడి కార్యకర్త తన విధులను

# సక్రమంగా నిర్వర్తించాలి

**సైదాపూర్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజవర్గం సైదాపూర్ మండల్ గుజ్జులపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించింది.




అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు చిన్నపిల్లలకు, పౌష్టిక ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రం ద్వారా అందరికీ అందుబాటులో ఉండాలని తెలంగాణ ప్రభుత్వం గొప్ప కార్యచరణ తో ఏర్పాటు చేస్తే దానికి విరుద్ధంగా అంగన్వాడి కార్యకర్త తన విధులను సక్రమంగా నిర్వర్తించకుండా, అడపా దడపాగా విధులను నిర్వహిస్తూ కాలాన్ని విలబోస్తున్నారు. ఇలా అయితే పిల్లలకి, బాలింతలకి తగిన పౌష్టిక ఆహారాన్ని ఎలా అందిస్తారు. నేటి పిల్లలే రేపటి పౌరులు అనే సిద్ధాంతాన్ని, సిద్ధాంతాలుగా మాత్రానికే పరిమితం చేస్తూ బాలింతలకి, శిశువులకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రం ద్వారా మాత్రమే పౌష్టికాహారం అందించే దిశగా ఎలా మారుతుంది అనేది గ్రామస్తుల ప్రశ్న?

# శాంతియుత సమాజమే పోలీసులు లక్ష్యం

- పటిష్టమైన శాంతి భద్రతలతోనే అభివృద్ధి సాధ్యం
- జిల్లా కలెక్టర్ జి. రవి
- విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- ఎస్పీ సింధు శర్మ
- అమరుల త్యాగాలు, ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలి.
- పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నివాళులు, కుటుంబ సభ్యులకు పరామర్శ

**జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజామంటలు):** విధి నిర్వహణలో, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ పోలీస్ ఫ్లాగ్ డే ను జిల్లా లో








ఘనంగా నిర్వహించారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ రవి ఐఏఎస్, జిల్లా ఎస్పీ సింధు శర్మ ఐపీఎస్ , పోలీస్ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ సింధు శర్మ ఐపీఎస్ మాట్లాడుతూ... పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంటే అభివృద్ధి ప్రతి ఒక్కరికి చేరుతుంది అనడానికి మన రాష్ట్రమే నిదర్శనం. ఈ సమాజం కోరుకునేది శాంతి, స్థిరత్వం, అభివృద్ధి.పోలీస్ శాఖ వారి త్యాగాల ద్వారా ఎన్నో దశాబ్దాలుగా సమాజంలో ప్రతి ఒక్కరికి రక్షణ కల్పిస్తూ, సామాజిక రుగ్మతలను పారద్రోలడం వరకు పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ కార్యదీక్షతో, సేవాతత్పరత తో పని చేస్తుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమరవీరులైన పోలీసుల త్యాగాలు వెల కట్టలేనివి వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పోలీస్ ఫ్లాగ్ డే ను ఘనంగా నిర్వహిస్తోంది. అమర వీరులు అయిన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31వ తేదీ జాతీయ ఐక్యత దినోత్సవం వరకు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల లో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు, కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఆన్లైన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, సాంకేతిక వినియోగం, ప్రజారక్షణ లో పోలీసుల సేవలు , ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ మొదలైన విషయాలను స్కూల్ పిల్లలకు తెలియజేయడం జరుగుతుంది. విద్యార్థులకు ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ, రక్తదాన శిబిరాలు,సైకిల్ ర్యాలి వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అసాంఘిక శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందిన అమరవీరుల వారి కుటుంబాలు ఇవాళ మన మధ్యలో ఉన్నారు గత రెండు దశాబ్దాలుగా మన జిల్లాలో మన మధ్యలో ఉన్న ఈ అమరులకు కుటుంబాలు లాగా క్లేశ పడే అవసరం రాకుండా ఉండడానికి కారణం మనందరికీ తెలుసు. కార్యనిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందికి పేరుపేరునా నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ మనకు, మన సమాజానికి శాంతిని స్థిరత్వాన్ని అభివృద్ధిని అందించిన మన సోదరులకు మరో గుర్తు చేసుకుంటూ వారికీ జోహారులు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రవి ఐఏఎస్ మాట్లాడుతూ... మనం ఈ యొక్క సొసైటీలో శాంతియుతంగా ప్రశాంతంగా జీవిస్తున్నామంటే దానికి కారకులైనటువంటి బోర్డర్స్ లో పనిచేస్తున్నటువంటి సైనికులు గాని, సొసైటీలో 24 గంటల పనిచేస్తున్నటువంటి పోలీసు వారే కారణం. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజావసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ తో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 31 వరకు జాతీయ ఐక్యత కోసం ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇది అభినందనీయమని కలెక్టర్ అన్నారు. విధి నిర్వహణలో అమరులైనటువంటి వారికి వారి కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తూనే వారికి ఎల్లప్పుడూ సపోర్టుగా పోలీస్ ఆఫీసర్స్ కావచ్చు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు రామాంజనేయులు, ప్రకాష్, రవీంద్ర రెడ్డి, ఎస్.బి. ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ సరిలాల్, ఫింగర్ ప్రింట్స్ ఇన్స్పెక్టర్ రాజు సి.ఐ లు, కిషోర్, కృష్ణకుమార్, కొటేశ్వర్, రమణమూర్తి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వామనమూర్తి, నవీన్, ఎస్.ఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### నూతన పార్లమెంట్ భవనానికి

# అంబేద్కర్ పార్లమెంట్ భవనం అని పేరు

- స్వాగతించిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం

**గొల్లపల్లి అక్టోబర్ 21 (ప్రజా మంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పార్లమెంట్ నూతన భవనానికి అంబేద్కర్ పార్లమెంట్ భవనం అని పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్వాగతిస్తుంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంబేద్కర్ త్యాగాన్ని మర్చిపోయారు కానీ చిన్న రాష్ట్రాలతోనే దేశం అభివృద్ధి చెందుతుంది. భారత రాజ్యాంగంలో పొందుపరిచడం ద్వారా తెలంగాణ రాష్ట్రం సాధించుకొని అభ్యుదయం వైపు ప్రయాణిస్తున్న అంబేద్కర్ త్యాగానికి చిహ్నంగా భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అంబేద్కర్ పార్లమెంటు భవనం అని పేరు పెట్టాలని మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకున్నది. తెలంగాణ సహకారం ఆయన పుణ్యమే అని మంత్రి కేటీఆర్ చెప్పడం జరిగింది. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పర్యవేక్షణలో ట్యాంక్ బండ్ వద్ద 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయించడం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తున్నది అంబేద్కర్ గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం



రాష్ట్ర ఈసీ మెంబర్ నల్ల శ్యామ్, గొల్లపల్లి మండల అధ్యక్షులు సూరమల్ల సతీష్, గొర్రె జాకబ్ రమేష్, భోజనపు శ్రీనివాస్, రత్నం, బొల్లం రమేష్, లక్కం నరేందర్, రవి దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండపల్లిలో మండల కార్యాలయాలు

- ప్రారంభించిన మంత్రి కొప్పుల, జడ్పీ చైర్ పర్సన్ వసంత, కలెక్టర్ రవి

**ఎండపల్లి అక్టోబర్ 21 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఎండపల్లి మండల మరియు కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యులు వెంకటేష్ నేత, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, కలెక్టర్ జి. రవి. ఈ కార్యక్రమంలో డిసిఎం ఎస్ ఛైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి జెడ్పీటీసీ సుధారాణి, ఎంపీపీ లక్ష్మి, అడిషనల్ కలెక్టర్లు బి.ఎస్. లత, అరుణ శ్రీ,ఆర్డీఓ మాధురి,సర్పంచ్ జలంధర్, మరియు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.







# జగపతి రావు మృతి తీరని లోటు

### స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ జి. రాజేశం గౌడ్

**హైదరాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** కరీంనగర్, జగిత్యాల నియోజకవర్గాల మాజీ శాసన సభ్యులు, ప్రజాబంధువు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకుడు వెలిచాల జగపతి రావు మృతి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతానికి నీటి పైన, నిధుల కేటాయింపు పైన జరుగుతున్న అన్యాయాన్ని ఎండగడుతూ స్వరాష్ట్ర ఏర్పడాలని ఎన్నో పత్రికల్లో వ్యాసాలు రాసి తెలంగాణ ప్రజలను జాగృతి చేసిన గొప్ప నాయకుడని అభివర్ణించారు. జగిత్యాల ఎం.ఎల్.ఏ. గా, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎం.ఎల్.సీ. గా కరీంనగర్ ఎం.ఎల్.ఏ. గా, బుగ్గారం సమితి అధ్యక్షులుగా, కరీంనగర్ డీసీఎంఎస్ అధ్యక్షులుగా, ఏపీ మార్క్ ఫెడ్ అధ్యక్షులుగా ఎన్నో పదవులు అలంకరించి ఆ పదవులకే వన్నె తెచ్చారని కొనియాడారు. ఆర్టీసీ, డీసీఎంఎస్, ఎండోమెంట్ లలో జిల్లాలోని నిరుద్యోగులకు వేలాది మందికి ఉద్యోగాలు ఇప్పించారనీ, ఎందరికో నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం చేశారని అలాంటి జగపతి రావు మరణం బాధాకరమని ఆయన మృతికి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్ ప్రగాడ సానుభూతిని సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రకటించారు. వీరితో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ గౌడ్ తన సంతాపం తెలిపారు.

# నేడే తెలుగు భాషాభిమానుల సమావేశం

**హైదరాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** అన్ని రాజకీయ పార్టీలు, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని కులాలు, మతాలు, సంఘాలు, ప్రాంతాలు ఒప్పుకునే పనులను మాత్రమే ముందుగా మొదలు పెట్టాలని తెలుగు సంఘాల ఉమ్మడి వేదిక తలుస్తున్నది. అలా అందరూ ఒప్పుకునే విషయాలే, తెలుగు కోసం చేయాల్సినవి చాల ఉన్నాయి. తెలుగు సంఘాల ఉమ్మడి వేదిక పై నుండి శనివారం, 22-10-2022, సాయంత్రం 7 గం. లకు జరిపే రచ్చబండలో పై అంశాలను చర్చించనున్నారు. సమావేశంలో పాల్గొనటానికి ఎప్పటి లాగా ఈ క్రింది లంకెపై నొక్కండి.
వీడియో కాల్ లింక్: %https://meet.google.com/ste-jdoz-xbs%- అని పారుపల్లి కోదండ రామయ్య తెలిపారు.

# మాటమీద నిలబడని ముఖ్యమంత్రి

### బస్తి సంపర్క్ లో బిజెపి ఎస్సి మోర్చా అధ్యక్షులు

**జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజామంటలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదని మాటమీద నిలబడే వ్యక్తి కాదని జిల్లా ఎస్సి మోర్చా అధ్యక్షులు అలగుర్తి లక్ష్మి నారాయణ అన్నారు. శుక్రవారం బిజెపి



తలపెట్టిన బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమం ఎస్సి మోర్చా మండల అధ్యక్షులు తరాల మహేష్, ప్రధాన కార్యదర్శి కోడిపెల్లి విష్ణు సారథ్యంలో తిమ్మాపూర్ గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ మొదటి నుంచి దళితులను మోసం చేస్తూనే ఉన్నాడన్నారు. హుజురాబాద్ ఎన్నికల సమయంలో దళితబంధు ప్రకటించి కేవలం ఆ పార్టీ అనుచరులకే ఇచ్చుకొంటున్నారన్నారు. దళిత సీఎం అని ప్రకటించి మాట తప్పాడన్నారు. అనంతరం ఆ బస్తి వాసులకు బిజెపి విధానాలను వివరించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ఉమేష్ మెరుగు, కోడిపెల్లి రవి, అరవింద్, దామెర అక్షయ్, శివ, బోగ గంగాధర్, కోడిపెల్లి ప్రభు కుమార్, కోడిపెల్లి రేవంత్, నక్క అజయ్, పాలేపు శేషూ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సూర్య గ్రహణం దృష్ట్యా

## వీరభద్ర స్వామివారి సేవలో స్వల్ప మార్పులు

**భీమదేవరపల్లి అక్టోబర్ 21 (ప్రజామంటలు):** మంగళవారం కేతుగ్రస్త సూర్య గ్రహణం సంభవించు చున్నందున కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఉ. 6:00 గం.ల లోపు స్వామి వారికి నిత్య పూజలు, మహా నివేదన నిర్వహించి ప్రధాన దేవాలయంతో పాటు ఉపాలయములు ద్వారభందనం చేస్తున్నామని ఈఓ కిషన్ రావు తెలిపారు. తిరిగి బుదవారం రోజున ఆలయ ద్వారములు తెరచి మహా సంప్రోక్షణ నిర్వహిస్తామని తెలిపారు. స్వామి వారికి అమ్మవారికి అభిషేకములు, అలంకరణ నిర్వహించి ఉ. 9:00 గం.ల నుండి భక్తులకు దర్శనములు, ఆర్జిత సేవలు నిర్వహించబడునని తెలిపారు. మంగళ వారము దేవస్థానము నందు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేయబడినవి అని తెలిపారు.

# నేడే ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ఇండేన్ గ్యాస్

### 57వ వసంతోత్సవం

**హుజురాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ తమ వంటగ్యాస్ ఇండేన్ గ్యాస్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చి 57 సంవత్సరాలు కావస్తున్నందున నేడు ఇండేన్ 57వ వసంతోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ ఇండేన్ విక్రయ అధికారి సి.సి.అలోక్ రెడ్డి, అంబుజా గ్యాస్ ఏజన్సీ అధినేత పి.వి.మదన్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వంటిటి నేస్తం అనే కార్యక్రమాన్ని ప్రారంభించి థర్డ్ పార్టీ సిబ్బంది ద్వారా వివిధ గ్యాస్ ఏజన్సీలలో నమోదైన ఇండేన్ కస్టమర్లను నేరుగా కలిసి వారి వారు క్రమంగా గ్యాస్ వాడుతున్నారా లేక వివిధ కారణాల వల్ల వాడడం లేదా అనే విషయాలను తెల్సుకోవడం, దీర్ఘ కాలంపాటు వంటగ్యాస్ వాడకుండా వుంటే వారిని ఒప్పించి కనెక్షన్ పునరుద్ధరణ చేయడం, కస్టమర్ గ్యాస్ వాడే విధానాన్ని తెల్సుకోవడం, నాణ్యత ప్రమాణాలు లేని రబ్బరు ట్యూబ్ వాడే ఇండేన్ కస్టమర్లను గుర్తించి ఐదళ్లపాటు ఉపయోగించే “సురక్ష రబ్బరు హెూస్” పైపు నిర్ణీత ధరలకు అందచేయడం లాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. దీనికితోడు వివిధ ఇండేన్ ఏజన్సీలలో కేక్ కటింగ్, చాక్లెట్ పంపిణీ, సేఫ్టీ క్లీనిక్, నాన్ డొమస్టిక్ సిలిండర్లు వాడే కస్టమర్లను కలిసే కార్యక్రమాలు, ఇండేన్ ద్వారా మార్కెటింగుకు సంభందించి పది కిలోల ఫైబర్, ఐదు కిలోల బ్లూ రెడ్ సిలిండర్ల మార్కెటింగ్ కొరకు ప్రచారోద్యమాన్ని ఇండేన్ 57వ వసంతోత్సవ వేళ నేటి 22 అక్టోబర్ న చేపడుతున్నట్లు అలోక్ రెడ్డి, మదన్ మోహన్ తెలిపారు.

### విత్తన ఉత్పత్తి క్షేత్రాలను

## పరిశీలించిన సీడ్ అధికారులు

**భీమదేవరపల్లి అక్టోబర్ 21 (ప్రజామంటలు):** వ్యవసాయ రంగంలో అనునిత్యం రైతులకు అందుబాటులో ఉండే ముల్కనూర్ సహకార బ్యాంక్ పరిధిలో గల



గ్రామాలలో తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ అందించిన కంది విత్తన ఉత్పత్తి క్షేత్రాలను హనుమకొండ సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ సురేష్, బ్యాంక్ వ్యవసాయ అధికారులు సంగ శీను, స్వామిరావు, సాయి కిరణ్ విత్తన ఉత్పత్తి క్షేత్రాలను పరిశీలించి రైతులకు మేలైన విత్తనాన్ని ఉత్పత్తి చేయడానికి తగు సలహాలు సూచనలు రైతులకు తెలియజేశారు.

### వెంగళాపూర్‌లో అంబేద్కర్

## విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

**గొల్లపల్లి అక్టోబర్ 21 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామంలో ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహేబ్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి గాను శుక్రవారం తెలంగాణ ప్రజాసంఘాల



జేఏసీ,అంబేద్కర్ యువజన సంఘాల కార్యనిర్వాహక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పేట భాస్కర్ మాట్లాడుతూ.... ఈ దేశం కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు చేసి భారత రాజ్యాంగాన్ని అందించిన మహానీయుడు అంబేద్కర్ గారని అయన విగ్రహం ఏర్పాటులో వెంగళాపూర్ గ్రామస్తులంతా సోదరభావంతో సహకరించాలని గ్రామ చౌరస్తాలో రోడ్డ ఇరుకుగా వున్నందున అందరి అభిప్రాయాల మేరకు బస్ సెల్టర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని ఇకపై ఏలాంటి గొడవలకు తావులేకుండా నిర్మాణం జరగలని పేట భాస్కర్ సూచించారు. ఈ సమావేశంలో టిఎవైఎస్ జిల్లా అధ్యక్షులు కొంగర పవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెవులమద్ది వినోద్, జిల్లా ఉపాధ్యక్షులు బరిగేల నరేష్, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షులు కొడిపెల్లి సురేష్, అంబేద్కర్ సంఘం స్థానిక నాయకులు గాదేం కొండయ్య, రెగుంట పెద్దయ్య, ఎనుగంటి తిరుపతి, సుంకే రాయనర్సు, బెక్కెం నర్సయ్య, బొంకంటి నరేష్, వంశీ, మురళి, గంగాబాబు, శేఖర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

### ధర్మపురిలో మహాత్మా జ్యోతి బాపూలే

## గురుకుల డిగ్రీ కళాశాల

### ప్రారంభించిన మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మపురి అక్టోబర్ 21 (ప్రజామంటలు):** ధర్మపురి లో మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల డిగ్రీ కళాశాల (బాలురు) ను ప్రారంభించిన రాష్ట్ర సంక్షేమ శాఖ




మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, ఎంపీ వెంకటేష్ నేత, కలెక్టర్ రవి నాయక్. అనంతరం ఏకికృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ మిగులు పనులకు శంకస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి జెడ్పీటీసీ అరుణ, మున్సిపల్ చైర్మన్ సత్తమ్మ అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, ఆర్‌డిఓ మాధురి, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, ప్రజా ప్రతినిదులు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### హన్మకొండలో పోలీస్

## అమరవీరుల వారోత్సవాల ర్యాలీ

**హన్మకొండ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** జిల్లాలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీపీ డా. తరుణ్ జోషి, పోలీస్



ఉన్నతాధికారులు, పోలీసుల అమరవీరుల కుటుంబాలతో ఉదయం కమిషనరేట్ కార్యాలయం నుండి మర్కజీ పాఠశాల వద్ద యూ టర్న్ చేస్తూ పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో స్థానిక అమరవీరుల త్యాగాలు నినాదాలు చేస్తూ పోలీస్ కళా బృందంచే హృదయాన్ని కదిలించే పాటలతో ర్యాలీ కొనసాగింది.

# భద్రాద్రి రాముని భూములు 650 ఎకరాలు

- ఆంధ్రప్రదేశ్ లో యదేచ్ఛగా దురాక్రమణ
- బీజేపీ కేంద్ర ప్రభుత్వ పాప ఫలితమే ఇది
- వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ, టీ.డీ.పీ. నాయకుల ప్రోత్సలంతోనే రాముని భూముల ఆక్రమణ
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్

**హైదారాబాద్ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్ లో బలవంతంగా, ఏకపక్షంగా విలీనం చేయడంతో ఈ దురాక్రమణకు ఆజ్యం. రాముని పేరిట రాజకీయాలే తప్ప చిత్తశుద్ది లేని బీజేపీ భద్రాద్రి రాముని భూములను ఆంధ్రప్రదేశ్ లో దురాక్రమణ నుంచి బీజేపీ కేంద్ర ప్రభుత్వం విముక్తి కలిగించాలి. పోలవరం ప్రాజెక్టులో ముంపుకు గురి కాని గ్రామాలను తిరిగి తెలంగాణకు స్వాధీనపర్చాలి. వై.ఎస్.ఆర్.సీ.పీ., టీ.డీ.పీ నాయకుల ప్రోత్సలంతోనే భద్రాద్రి రాముని భూముల ఆక్రమణ. భద్రాద్రి రామాలయానికి సంబంధించిన సుమారు 650 ఎకరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యదేచ్ఛగా దురాక్రమాలకు గురయ్యాయని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ చర్యల వల్లే భద్రాద్రి రాముని భూముల దురాక్రమాలకు ఆస్కారం కలిగాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. రాముని పేరిట రాజకీయాలు చేయడం తప్ప భద్రాద్రి రాముని భూముల రక్షణలో బిజెపి కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందని వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం భద్రాచలం నుంచి న్యాయవాదులు, పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో వినోద్ కుమార్ ను కలిసి భద్రాద్రి రాముని భూముల ఆక్రమణల గురించి వివరించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ భద్రాద్రి రాముని భూముల అన్యాక్రాంతానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలలో బలవంతంగా, ఏకపక్షంగా ఆంధ్రప్రదేశ్ లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విలీనం చేసిందని, దీంతో భద్రాద్రి రాముని భూములకు రక్షణ లేకుండా పోయిందని వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో భద్రాద్రి రామాలయం దేవస్థానానికి చెందిన 899



ఎకరాల భూములు ఉండగా అందులో సుమారు 650 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని వినోద్ కుమార్ తెలిపారు. ఈ భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అధికారులకు, ఎండోమెంట్స్ అధికారులకు, పోలీసు అధికారులకు భద్రాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఫిర్యాదులు చేసినా, విన్నవించినా పట్టించుకునే నాధుడే లేకుండా పోయారని, అయితే తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ, టీ.డీ.పీ. నాయకుల ప్రోత్సలం తోనే భద్రాద్రి రాముని భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని వినోద్ కుమార్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో ముంపుకు గురి కాకుండా ఉన్న ఏడు మండలాలలోని గ్రామాలను తిరిగి తెలంగాణ కు స్వాధీనపర్చాలని, అందుకు పార్లమెంటులో చట్టం తీసుకుని రావాలని వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# వయోవృద్ధులకు టాస్కా ఆసరా

### సీనియర్ సీటీజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు

**జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజామంటలు):** రాష్ట్రములోని వయోవృద్ధుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం తెలంగాణ ఆల్ సీనియర్ సీటీజన్స్ అసోసియేషన్ ఆసరాగా ఉంటుందని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహారావు అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని నేతాజీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ సమావేశ మందిరంలో తెలంగాణ ఆల్ సీనియర్ సీటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా సర్వ సభ్య ప్రతినిధుల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదర్శ తల్లిదండ్రులను, మాతృ మూర్తులను, సంఘ సేవలు చేస్తున్న 86 మందిని పట్టు శాలువల్తో, మెమోంటో లతో రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఇదే రోజు టాస్కా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.... వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే నన్నారు. వయోవృద్ధుల, తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007 నియమావళి 2011 ప్రకారం పిల్లలు తల్లిదండ్రులను నిరాదరిస్తే,వారి పోషణను పట్టించుకోకుండా ఉంటే జిల్లాలో ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ లో వయోవృద్ధుల సంరక్షణ కు ప్రభుత్వం వాలంటరీ కమిటీ వేస్తారని, కమిటీకి చైర్మన్ గా సబ్ ఇన్స్పెక్టర్ ఉంటారని,ఇద్దరు సభ్యులుగా తమ సీనియర్ సీటీజన్స్ అసోసియేషన్ ప్రతినిధులను ఎన్నుకునేందుకు హెూమ్ మంత్రి మహమూద్ అలీ చర్యలకు ఆదేశించారని పేర్కొన్నారు. తమ అసోసీయేషన్ వినతికి సత్వరం స్పందించి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ప్రభుత్వం తరపున వృద్ధాశ్రమాల ఏర్పాటు చేస్తు0డడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ సీనియర్ సీటీజన్స్ కు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని అభినందిస్తూ సన్మానించారు. హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ.... జిల్లాలో తమ సర్వే ప్రకారం 86 వేల మంది సీనియర్ సీటీజన్స్ ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రవి ఆధ్వర్యంలో ఆర్డీవోలు మాధురి,వినోద్ కుమార్ లు వయోవృద్ధుల కేసుల పరిష్కారం లో నెంబర్ వన్ గా నిలిచారని అభినందనలు తెలిపారు. జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ కరోనా టీకాలు సీనియర్ సీటీజన్స్ కు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారని,నడవ లేని వృద్ధులకు తమ సంఘ వినతిపై వారి ఇంటి వద్దకే ఆరోగ్య సిబ్బందిని పంపి టీకాలు వేయించడాన్ని కొనియాడారు. జిల్లా కేంద్రంలో డే కేర్ సెంటర్ ఏర్పాటుకు కోరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సమయంలో ఆసరా లేని వృద్ధుల ఇండ్లకు వెళ్లి నిత్యావసర సరుకులు అందజేశామని, పేదలకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అనంతరం జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి వీరేశం లు ప్రకటించి, వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడుగా హరిఅశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారిగా వెలముల ప్రకాష్, ఉపాధ్యక్షులుగా బొల్లం విజయ్, పి.సి. హన్మంత రెడ్డి, ఎం.డి. యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పూసాల అశోక్ రావు, కొయ్యడ సత్యనారాయణ, జాయింట్ సెక్రెటేరిలుగా బొబ్బాటి కరుణ, రాజగోపాల్ చారి, డిండిగాల విఠల్, కార్యవర్గ సభ్యులుగా వొజ్జల బుచ్చిరెడ్డి, దేవేందర్ రావు, శ్రీనివాస్, కాలగిరి గంగా రెడ్డి, కండ్లే గంగాధర్, ఉప్పుగళ్ల మురళీధర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు ఘనంగా ప్రారంభం

**కొడిమ్యాల అక్టోబర్ 21 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఖో-ఖో క్రీడల పోటీలను ముఖ్య అతిథులు జ్యోతి వెలిగించి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఏలేటి మమత-నరసింహారెడ్డి వహించగా ముఖ్య అతిథులుగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి , రాష్ట్ర ఖో-ఖో అధ్యక్షులు రాఘవరెడ్డి హాజరయ్యారు. ప్రారంభోత్సవంలో విజ్ డమ్ విద్యా భారతి విద్యాసంస్థల విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పది జిల్లాల నుండి వచ్చిన ఖో-ఖో టీమ్స్ మార్చ్ ఫాస్ట్ చేసి పరిచయం చేసుకున్నారు. అదేవిధంగా విజ్ డమ్ విద్యా భారతి విద్యాసంస్థల ప్రిన్సిపల్ దీకొండ అశోక్ కరీంనగర్ జిల్లా ఖో ఖో టీం ఇరుజట్లకు జెర్సీ (టీ షర్ట్) లను అందజేసినారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భారతదేశంలో కబడ్డీ తర్వాత అత్యంత ఆదరణ పొందిన క్రీడ ఖో-ఖో అని తెలుపుతూ ఆటలు శారీరక సౌష్టవం కొరకు మానసిక ఉల్లాసం కొరకు తరతరాల నుండి ఆటలు ఒక అద్భుతమైన సాధనంగా ఉపయోగపడుతున్నాయని అంతే కాకుండా శారీరక వ్యాయామంతో పాటు మానసిక వికాసం పెరిగి అధికబరువు, ఒత్తిడిని, ఏదో తెలియని వెలితిని ఆటల ద్వారా అధిగమించవచ్చని తెలుపుతూ క్రీడలు మానసిక ఎదుగుదలకు, సోషల్ స్కిల్స్ సాధించడానికి, టీం వర్క్ , శారీరక ఎదుగుదలకు కాంపిటీటివ్ స్పిరిట్, స్పోర్ట్స్ స్పిరిట్ పెంపొందిస్తాయని అన్నారు. పది జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖో-ఖో జిల్లా సెక్రెటరీ మహేందర్ రావు, జడ్పిటిసి



పుణుగోటి ప్రశాంతి, ఎంపిటిసి జమాలపురి. రాజేశ్వరి-రాజేందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాంపల్లి మల్లేశం, రిటర్డ్ హెచ్.ఎం. గుడి రఘుపతిరెడ్డి, ఎస్ జి ఎఫ్ సెక్రటరీలు శ్రీనివాస్, శ్యాంప్రసాద్ కృష్ణయ్య, పోచప్ప, కొడిమ్యాల ఆర్గనైజింగ్ సెక్రెటరీలు, రవీందర్ బల్ల మల్లేశం, కృష్ణంరాజు, అనిల్ దేవిడ్సన్, గుర్రం నర్సయ్య, రాపర్తి లక్ష్మణ్, కొండ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు పథకం ద్వారా కారు మంజూరు

- సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల శ్వర్‌లకు కృతజ్ఞతలు

**గొల్లపల్లి అక్టోబర్ 22 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికై ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం ద్వారా కారు మంజూరు చేయించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాపల్లె సర్పంచ్ నల్ల శ్యామ్ ఏఎంసి మాజీ వైస్ ఛైర్మన్ బోయపోతు గంగాధర్, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు రమేష్ యూత్ మండల ఉపాధ్యక్షుడు సల్లూరి శోభన్ గౌడ్, టిఆర్ఎస్ యూత్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లే భగత్ కుమార్, తదితరులు పాల్గొని దళిత బంధు పథకం మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ లకు కృతజ్ఞతలు తెలిపారు.





మునుగోడు ఉపఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ జి.రాజేశం గౌడ్, మెటుపల్లి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ గౌడ్.

## పోలీస్ అమరవీరుల త్యాగాలను మరువద్దు

### పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి

**హన్మకొండ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రజల రక్షణ కొరకే పోలీసు కమిషనర్ డా. తరుణ్ జోషి తెలిపారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి వరంగల్ పోలీసు కమిషనరేట్ అధ్వర్యంలో క్రోవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు కమిషనర్ తో పాటు పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు



అధికారులు సిబ్బంది పాల్గొన్న ఈ ర్యాలీ స్థానిక అశోక టాకీస్ సెంటర్ నుండి పోలీసు కమిషనరేట్ కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వరకు కొనసాగించి ఈ ర్యాలీ పోలీసు అమరవీరుల కు జోహార్లు, నినాదాలతో నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు స్థూపం వద్ద క్రోవ్వత్తులను వుంచి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమరవీరుల బలిదానాలు స్మరిస్తూ కర్తవ్య నిర్వహణ లో ముందుకు సాగిపోవాలని, పోలీసు అమరవీరుల కుటుంబాలను బాసటగా నిలుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ డి.సి.పి. లు అశోక్ కుమార్, వెంకట లక్ష్మి, అదనపు డి.సి.పి. లు సురేష్ కుమార్, సంజీవ్ ఏ.ఆర్ ఎ.సి.పి. లు, ఆర్.ఐ లు, ఇన్స్ పెక్టర్లతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది జాగృతి కళాబృందం సభ్యులు, అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### పోలీస్ అమర వీరులకు నివాళులర్పించిన

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**హన్మకొండ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగిన పోలీస్ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ



సందర్భంగా మంత్రి పోలీస్ అమర వీరులకు నివాళులర్పించారు. తదనంతరం పోలీస్ ల గౌరవ వందనం స్వీకరించారు. కొందరు పోలీస్ అమర వీరులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరులకు నివాళులు. రాజ్యాంగం ప్రకారం చట్టాన్ని అమలు చేస్తూ, సమాజాన్ని సక్రమ మార్గంలో పెడుతున్నది పోలీస్ లే పోలీస్ వృత్తి అనేక వత్తిడిలతో కూడుకున్నది. పోలీస్ లు తమ వృత్తి ధర్మం కోసం, కుటుంబాల ను కూడా లెక్క చేయకుండా పని చేస్తున్నారు. పోలీస్ లు కొందరు కర్తవ్య నిర్వహణలో తమ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వారి అలాంటి వారి త్యాగాలు గొప్పవి. వారి కుటుంబాలను సరైన రీతిలో ఆదరించడం, గౌరవించుకోవడం మన విధి. నేను రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నాటి నుండి ఈ కార్యక్రమంలో క్రమం తప్పకుండా పాల్గొంటున్నాను. విధి నిర్వహణలో తమ ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరులకు నివాళులు అని తెలిపారు.




సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా చేర్మన్ (ఆర్టిఐ) తోకల శ్రీధర్ ను రాష్ట్ర వైస్ చైర్మన్ బెక్కం జనార్ధన్ సన్మానించారు. పాల్గొన్న జగిత్యాల జిల్లా బీసి సంక్షేమ సంఘం అధ్యక్షులు గాజుల నాగరాజు, గొడిసెల బాలుగౌడ్, శేర్ల గౌతం, బాలె నరేష్ తదితరులు

# అమర పోలీసులకు ఘన నివాళులు

**రామ కిష్టయ్య సంగన భట్ల**

అవిభక్త కరీంనగర్ జిల్లా లోనే ప్రప్రథమంగా పోలీసు స్టేషన్ బయట ప్రజా సహకారంతో ధర్మపురి క్షేత్రంలో నిర్మించిన పోలీసు అమర వీరుల స్తూపం వద్ద శుక్రవారం ధర్మపురి పోలీసుల ఆధ్వర్యంలో అమర వీరులకు నివాళులు అర్పించారు. పీపుల్స్ వార్ ఉద్యమ చరిత్రలో అవిభక్త ఆంధ్ర రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ధర్మపురి క్షేత్రం నుండి బొడ్డున సాయుధ ఎఆర్ కానిస్టేబుల్ కోమల్ రెడ్డిని హతమార్చడం జరిగింది. ఈ నేపథ్యాన్ని దృష్టి యందుంచుకుని క్షేత్రంలో గత సి.ఐ. లు దామెర నర్సయ్య మరియు నల్ల మల్లారెడ్డి ల చొరవ ఫలితంగా ఎస్.ఐ. కోటేశ్వర్ ఆధ్వర్యంలో, పోలీసు అమర వీరుల స్మృత్యర్థం 2005 సంవత్సరంలో స్థూపాన్ని నిర్మించగా, ప్రస్తుతం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసులు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ముగింపు కార్యక్రమంగా, ధర్మపురి క్షేత్రంలో అమరవీరుల సంస్మరణ దినమైన శుక్ర వారం విధి నిర్వహణలో గతంలో అసువులు బాసిన పోలీసుల స్మృతి చిహ్నంగా నిర్మించిన స్థూపం వద్ద, అమర వీరులకు నివాళు లర్పించారు. దివంగత పోలీసులను స్మరిస్తూ ధర్మపురి సిఐ కోటేశ్వర్ నేతృత్వంలో, బుగ్గారం ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో స్మారక స్థూపం వద్ద లాంఛనాలతో పోలీసులు, నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. అమర వీరుల సంస్మరణ దినోత్సవ నేపథ్యాన్ని వివరించారు. అమర పోలీసుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా ధర్మపురి పురపాలక సంఘం చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామయ్య, కమిషనర్ రమేశ్, డీసీసీ సభ్యులు దినేశ్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, సంగి శేఖర్, వేముల రాజు, వివిధ నాయకులు పోలీసులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని అమర వీరులకు నివాళులు అర్పించారు. నామమాత్ర సంస్మరణ కార్యక్రమాలు. విధి నిర్వహణలో తీవ్రవాదుల చేతులో, అసువులు బాసిన అమర పోలీసుల త్యాగాన్ని గుర్తుకు చేసుకుంటూ, వారి ఆత్మలకు శాంతిని చేకూర్చేందుకు నిర్దేశితమైన అమరుల పోలీసుల సంస్మరణ కార్యక్రమాలు ధర్మపురి క్షేత్రంలో నామమాత్రంగా, ప్రహసనంలా జరిగాయి. జిల్లాలోనే ప్రప్రథమంగా పోలీసు స్టేషన్ బయట ప్రజల విరాళాలతో, సహకారంతో నిర్మించిన పోలీసు అమర వీరుల స్థూపం వద్ద శుక్రవారం ధర్మపురి సర్కిల్ పరిధిలో విధి నిర్వహణలో ఆసువులు బాసిన పోలీసులు ఆత్మశాంతి కోసం ప్రార్థనలు జరిపి, సంస్మరణ సభ నిర్వహించాల్సి ఉండగా, ఈ కార్యక్రమాన్ని లాంఛన ప్రాయంగానే జరిపారు. సంవత్సరాలుగా ధర్మపురి స్టేషన్లో వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించే పోలీసులు, వాస్తవానికి అమర వీరుల సంస్మరణ వారోత్సవాలనూ ఈసారి చిన్నచూపు చూశారు. పీపుల్స్ వార్ ఉద్యమ చరిత్రలో రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ధర్మపురి క్షేత్ర నడిబొడ్డున సాయుధ ఎఆర్ కానిస్టేబుల్ కోమల్ రెడ్డిని హతమార్చిన సంఘటన రాష్ట్రవ్యాప్త సంచలనానికి హేతువైంది. ఈ నేపథ్యాన్ని పుర స్కరించుకుని, 2004 అక్టోబర్ లో అమర వీరుల వారోత్సవాల సందర్భంగా, ప్రజా ప్రతినిధులు, నాయకులు చేసిన సూచనలను అనుసరించి, క్షేత్రంలో పోలీసు అమర వీరుల స్మృత్యర్థం స్థూపాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పు రస్కరించుకుని, ధర్మపురి క్షేత్రంలో, 2005 సంవత్సరంలో అమర వీరుల సంస్మరణ దినమైన ఆకోబర్ 21వ తేదీన, అమర పోలీసుల స్థూపాన్ని ఆవిష్కరించారు. క్షేత్రంలో ని, పోలీస్ స్టేషన్ ప్రహారీగోడ సమీపాన చౌరసా లో వాస్తవంగా 2004లోనే సూప నిర్మాణానికి శంకుసాపన జరిపారు. ఈ ప్రాంతంలో హింసలో అసువులు బాసిన పోలీసులు నిర్వహించిన స్థూప నిర్మాణ కార్యక్రమాన్ని నాటి సర్కిల్ ఇన్స్పెక్టర్ దామెర నర్సయ్య లాంఛనంగా ప్రారంభించగా, 2005లో సీఐ నల్ల మలా రెడ్డి చొరవతో, ఎస్ఐ కోటేశ్వర్, సిబ్బంది మిగిలిన పనులను పూర్తి గావించారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా తీవ్రవాదులచే ధర్మపురి క్షేత్ర నడిబొడ్డున, బస్ స్టేషన్ సమీపాన, 1985 జూలై 23వ తేదీన పీపుల్స్ వార్ చే కాల్చి చంపబడిన సాయుధ కానిస్టేబుల్ చల్ల కోమల్ రెడ్డితో పాటు ధర్మపురి మండలంలోని నేరేళ్ళ మరియు సారంగాపూర్ మండలంలోని బట్టపెల్లి, పోతారం మధ్య రోడుపై 1993 అక్టోబర్ 1వ తేదీన పీపుల్స్ వార్ తీవ్రవాదులు పేల్చిన మందు పాతరలో మృతి చెందిన సారంగాపూర్ స్టేషన్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ (శ్రీనివాస్ 1515), అదే స్టేషన్లో పని చేసిన శ్రీనివాస్ (పిసి 2290), జగి త్యాల టౌన్లో పనిచేసిన ప్రకాశ్ (పిసి 818) జగిత్యాల రూరల్ పోలీసు స్టేషన్లో పనిచేసిన రాజయ్య (పిసి176) ల సంస్మరణార్థం వారి పేర్లు చెక్కిన, ఫలకాన్ని ఏర్పాటు చేశారు. సదరు సంస్మరణ స్థూపాన్ని 2004లో నిర్మించ నిర్ణయించి, 2005లో పూర్తి చేసి, ప్రారంభించి, 2006 నుండి ఘనంగా సంస్మరణ సభ నిర్వహిస్తూ వస్తున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ, అనుదినం విద్యార్థులకు పోలీసుల విధులు,



పౌరుల బాధ్యతలు, పోలీసుల విధి నిర్వహణలో ఇబ్బందులు తదితర అంశాలపై వివిధ స్థాయిల్లో వ్యాస రచన ఉపన్యాస, క్విజ్ పోటీలు, నిర్వహించి బహుమతులు ప్రోత్సాహకాలు అందజేయడం, ఓపెన్ హౌజ్ పేరుతో ఆయుధాల గురించి, కేసులు నమోదు పోలీసుల వివిధ ర్యాంకులు తదితర విషయాలపై ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ, స్టేషన్ అంతా తిప్పి చూపిస్తూ పిల్లలకు అవగాన పెంపొందించడం అనవాయితీ. అధికారులకు వివిధ కేసులు, విచారణలు, పరిశోధనలు, ఫైరింగ్ ప్రాక్టీస్, శిక్షణలు, కోర్టుల పనులు, ఇతర విధులలో నిమగ్నం కావాల్సి రాగా, క్రింది స్థాయి అధికారులు, సీనియర్ ఉద్యోగులు, సిబ్బంది ఆనవాయితీగా వస్తున్న కార్యక్రమాలను నిర్వహించడంపై అలసత్వం ప్రదర్శించడం తోటి పోలీసులకే మనో వేదన కలిగించింది. పోలీస్ సంస్మరణ వారోత్సవాలలో చివరి కార్యక్రమంగా ప్రజల సహకారంతో నిర్మించిన స్థూపం వద్ద అమర పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడంలోనూ చూపిన అశ్రద్ధ, అలసత్వం ఎక్కువ మంది ప్రజా ప్రతినిధులు, నాయకులు, సంఖ్యా పరంగా కూడా ఎక్కువ లేకుండా, కారణాంతరాల వల్ల నామమాత్రంగా స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి, శ్రద్ధాంజలి ఘటించి కార్యక్రమం నిర్వహించామని పించడం పట్టణ ప్రజలకు బాధను మిగిల్చింది.



'ఊర్వసివో రాక్షసివో' నుంచి

## నేడు మెలోడి సాంగ్ విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో అల్లు శిరీష్ మూడేళ్ళు గ్యాప్ తీసుకుని 'ఊర్వసివో రాక్షసివో' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యాడు. రాకేశ్ శశి దర్శకత్వం వహించిన ఈ చిత్రం గతేడాదే షూటింగ్ పూర్తి చేసుకుంది. కానీ పలు కారణాల వల్ల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. మొదట్లో ఈ చిత్రానికి 'ప్రేమ కాదంట' అనే టైటిల్‌ను ప్రకటించారు. ఇక ఇటీవలే టైటిల్ పేరునూ మారుస్తూ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రోమ్-కామ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 4న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నారు. తాజాగా మేకర్స్ మరో అప్‌డేట్ ప్రకటించారు.ఈ చిత్రంలోని 'కలిసుంటే' అంటూ సాగే రొమాంటిక్ మెలోడీ సాంగ్‌ను శనివారం సాయంత్రం 4గంటలకు రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. అచ్చు రాజమణి స్వర పరిచిన ఈ పాటను కేకే రచించగా.. ఆర్మాన్ మాలిక్ ఆలపించాడు. ఇది వరకే రిలీజైన మాయరే, దీంతానా సాంగ్‌లకు విశేష స్పందన వచ్చింది. ఈ చిత్రాన్ని జీఏ-2 పిక్చర్స్, శ్రీ తిరుమల ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. శిరీష్‌కు జోడీగా అను ఇమ్మాన్యూయెల్ హీరోయిన్‌గా నటించింది.

---

## జిన్నాలో ఢీ లాంటికామెడీ ఉంది

**హీరో మంచు విష్ణు భరోసా**

మంచు విష్ణు హీరోగా ఈషాన్ సూర్య దర్శకత్వంలో తెరకెక్కిన 'జిన్నా' మూవీ ఈ రోజు తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో విడుదలయ్యింది. ఈ సందర్భంగా విష్ణు చెప్పిన విశేషాలు. షోలు వేసి ప్రివ్యూ చూపించాం. అందరూ విపరీతంగా ఎంజాయ్ చేశారు. ఢీ సినిమా చేసేటప్పుడు ప్రతిక్షణం నవ్వుతూనే ఉన్నాం.



జనాలకీ నచ్చేసింది. ఇది ఆ రేంజ్‌లో హిట్టవుతుందో లేదో అనేది తెలీదు కానీ ఇంటర్వెల్ చూసి షాకవుతారు. 'ఢీ'లో ఇంటర్వెల్‌కి సర్‌ప్రైజ్ ఉండదు. అదే ఈ రెండు సినిమాలకీ తేడా. హీరో నేనే అయినా చమ్మక్ చంద్ర, వెన్నెల కిషోర్ పాత్రలు నాకు ఎక్కువ నచ్చాయి. సెకెండాఫ్ కడుపుబ్బ నవ్వించేస్తాం. నాకు యాక్షన్ కామెడీ జానర్ కలిసి వచ్చింది. మధ్యలో కొన్ని ట్రై చేసి తప్పు చేశాను. దాన్ని దిద్దుకునే ప్రయ త్నమే ఈ సినిమా. నా పాత్ర పేరు జి.నాగేశ్వరరావు. జీనా అని పిలిస్తే బాగుండదు. అందుకే జిన్నా అని పెట్టాం. అప్పు చేసి టెంట్ హౌస్ పెట్టుకుంటాడు. కానీ ఏ పెళ్లికి టెంట్ వేసినా ఆ పెళ్లి ఆగిపోద్ది. మరి అప్పు ఎలా తీర్చుతాడనేది కాన్సెప్ట్. టైటిల్ విషయంలో కాంట్రవర్సీ అవుతుందని కొందరు అన్నారు. కానీ ఉద్దేశం మంచి దయినప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొందామని ఫిక్స్ చేశాం. మూల కథ జి.నాగేశ్వరరెడ్డి గారిదే. కానీ కోన వెంకట్ పూర్తిస్థాయిలో రెడీ చేశారు. సన్నీ లియోన్ డేట్స్ లాక్ చేసుకుని నా దగ్గరికి వచ్చారు. సన్నీ తెలుగులో అంత పాపులర్ కాదు కదా అనుకున్నా. కథ బాగుంది చేయమన్నారు నాన్న. సన్నీ అయితే బాగుంటుందని మీడియా ఫ్రెండ్ ఒకరు కూడా అనడంతో ఆమె ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. నా పిల్లలు ఓ పాట పాడారు. సరిగ్గా పాడకపోతే నెగిటివ్ టాక్ వస్తుందని అందరూ హెచ్చరించారు. కానీ వారిద్దరూ ట్రెయిన్డ్ సింగర్స్. బాగా పాడారు. 'ఢీ' సీక్వెల్ జనవరి లేదా ఫిబ్రవరిలో స్టార్టవుతుంది. మంచి కథ ఎక్కడున్నా మనవాళ్లకి చెప్పాలనే ఉద్దేశంతో చాలా సినిమాల రీమేక్ రైట్స్ కొన్నాను. వేరే హీరోలతోనూ ఆ సినిమాలు తీస్తాను. నవంబర్ చివర్లో ఈ చిత్రాల గురించి ప్రకటిస్తాను. 'ఆండ్రాయిడ్ కుంజప్పన్' రైట్స్ నాన్న కోసం తీసుకున్నాను.

## మహిళల ఆర్థిక ప్రగతి పటిష్టమైన చర్యలు

**జనగామ అక్టోబర్ 21 (ప్రజామంటలు):** నిరుపేద మహిళల ఆర్థిక ప్రగతి పెంచేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో పాలకుర్తి



నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మహిళల ఆర్థిక ప్రగతి పెంచేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి కార్యకలాపాలపై, హరితహారం పెన్షన్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... పాలకుర్తి నియోజకవర్గం లోని పాలకుర్తి మండలం లో 600, కొడకండ్లలో300, దేవరుప్పలలో 500 మంది నిరుపేద మహిళలను ఎంపిక చేసి కుట్టుమిషన్ల శిక్షణ ఇప్పించాలన్నారు. సదరు కార్యక్రమానికి అన్ని సౌకర్యాలతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకుగాను పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. 50మంది చొప్పున బ్యాచ్ లు చేసి కుట్టు మిషన్ లపై శిక్షణ ఇప్పించేందుకు మాస్టర్ ట్రైనర్స్ ను నియమించాలన్నారు. శిక్షణా కార్యక్రమం లో భోజన సౌకర్యం కల్పించాలన్నారు. హరితహారం పై సమీక్షిస్తూ లక్ష్యాలను పెంచుకుంటూ పోవాలని అందుకు తగిన విధంగా నర్సరీలలో మొక్కల లక్ష్యాలను కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు విత్తన బంతుల కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. స్మృతి వనాలు పల్లె ప్రకృతి వనాలు పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయా అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని ముందుగా రైతులను సంప్రదించి అంచనా వేయాలని అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలని గన్ని బ్యాగ్స్ అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పెన్షన్ల నివేదిక రూపొందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ డిఆర్డి ఓ రామ్ రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి డిపిఎంలు తదితరులు పాల్గొన్నారు.





## జపాన్‌లో సందడిచేస్తున్న ఆర్ఆర్ఆర్ టీమ్

ఆర్ఆర్ఆర్' టీమ్ ఇప్పుడు జపాన్‌లో సందడి చేస్తోంది. శుక్రవారం ఈ చిత్రాన్ని జపాన్‌లో విడుదల చేస్తున్నారు. దీని కోసం తారక్, రామ్‌చరణ్, రాజమౌళి రెండ్రోజుల క్రితమే జపాన్ చేరుకుని ప్రమోషన్ చేస్తున్నారు. జపాన్ మొత్తం పర్యటిస్తున్నారు రాజమౌళి. ఈక్రమంలో రాజమౌళి జపనీస్ వీడియో గేమ్ డైరెక్టర్, క్రియేటర్ హిడియో కొజిమాను కలిశారు. దీనికి సంబంధించిన ఫొటోను రాజమౌళి ట్విట్టర్ షేర్ చేశారు. 'జపాన్‌లో ప్రముఖ వీడియో గేమ్ డైరెక్టర్ కొజిమాని కలవడం ఆనందంగానూ, గౌరవంగానూ ఉంది. గేమ్‌లు, సినిమాలతోపాటు ఎన్నో విషయాల గురించి ఆయనతో మాట్లాడాను. ఈ జ్ఞాపకాలను చిరకాలం గుర్తుంచుకుంటాను' అని ట్వీట్‌లో రాసుకొచ్చారు రాజమౌళి. కొజిమా కూడా జక్కన్నతో తీసుకున్న ఫొటోను తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. రాజమౌళి మా కెజెపిని సందర్శించారు. మేము ఆయన్ని స్కాన్ చేశాము' అని ట్వీట్ చేశారు. మరి జపాన్ ప్రేక్షకులు 'ఆర్ఆర్ఆర్' ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి.

## బెంగాల్ నటి వినోదిని ఆత్మకథలో కంగనా

మొదట్లో ఫుల్ గ్లామరస్ పాత్రలు చేసింది కంగనా రనౌత్. దాంతో ఆమె కమర్షియల్ హీరోయిన్‌గానే మిగిలిపోతుంది అనుకున్నారంతా. కానీ ఎవరూ ఊహించని స్థాయికి చేరుకుంది. నటిగా ఎన్నో మెట్లు చకచకా ఎక్కేసింది. నాలుగుసార్లు జాతీయ అవార్డును అందుకుంది. మెగాఫోన్ పట్టి డైరెక్టర్‌గాను, మరోవైపు నిర్మాతగాను కూడా ప్రూవ్ చేసుకుంది. ఇప్పుడామె బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. అయితే కమర్షియల్ మూవీస్ కంటే రియాలిటీకి దగ్గరగా ఉండే స్టబెక్టులకే ఎక్కువ ఇస్తోంది. రియల్ లైఫ్ క్యారెక్టర్స్ చేయడానికి ఆసక్తి చూపిస్తోంది. ఇప్పటికే 'మణికర్ణిక'లో ఝాన్సీ లక్ష్మీబాయిగా అలరించింది. 'తలైవి'లో జయలలితగా ఆకట్టుకుంది. ప్రస్తుతం 'ఎమ్జర్గ÷న్సీ'లో ఇందిరాగాంధీ పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు మరో బయోపిక్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బెంగాలీ నటి వినోదినీ దాసి పాత్రలో కనిపించనుంది కంగనా. పరిణీత, మర్దానీ వంటి ఫిమేల్ ఓరియెంటెడ్ చిత్రాలు తీసిన ప్రదీప్ సర్కార్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోతున్నాడు. ఆయన దర్శకత్వంలో నటించడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నానని కంగనా సంతోషంగా చెబుతోంది. పంతొమ్మిదో శతాబ్దంలో బెంగాలీ చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా వెలిగారు వినోదిని. 'అమర్‌కథ' పేరుతో ఆటోబయోగ్రఫీ కూడా రాసి సెన్సేషన్ క్రియేట్ చేశారు.



## సంక్రాంతి బరిలో దిగనున్న బాలయ్య

'అఖండ' చిత్రంతో నందమూరి అభిమానుల్లో ఫుల్ జోష్ నింపాడు బాలకృష్ణ. గతేడాది విడుదలైన ఈ చిత్రం బాలకృష్ణ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బాస్టర్‌గా నిలిచింది. అంతేకాకుండా ఈ చిత్రంతో వంద కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టాడు. ప్రస్తుతం అదే జోష్‌తో బాలకృష్ణ తన తదుపరి సినిమా షూటింగ్‌ను వేగంగా పూర్తి చేస్తున్నాడు. ప్రస్తుతం ఈయన హీరోగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో పొలిటికల్ టచ్ ఉన్న మాస్ యాక్షన్ సినిమాను చేస్తున్నాడు. 'క్రాక్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత గోపిచంద్ మలినేని.. బాలకృష్ణతో సినిమా చేయనుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, గ్లింప్స్ సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రాన్ని మైత్రీ సంస్థ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా 'మెగా154'ను కూడా మైత్రీ సంస్థ నిర్మిస్తుంది. కాగా మెగా 154 పోస్ట్ ప్రొడక్షన్‌కు కాస్త ఎక్కువ టైం పడుతుందట. దాంతో చిరు సినిమా సంక్రాంతికి వచ్చే చాన్స్ తక్కువగా ఉందట. ఈ క్రమంలో మైత్రీ సంస్థ బాలయ్య సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేసే ప్లాన్ చేస్తుందట. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. అయితే ఇందులో నిజమెంతుందో తెలియాలంటే మాత్రం మేకర్స్ నుండి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలయ్య డ్యూయల్ రోల్‌లో నటించనున్నట్లు టాక్. మైత్రీ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. కన్నడ యాక్టర్ దునియా విజయ్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



## పాన్ ఇండియాక్రేజ్‌లో కాంతారా

ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై బాక్సాఫీసు వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న కన్నడ చిత్రం 'కాంతార'. ఇప్పుడీ సినిమా పాన్ ఇండియా క్రేజ్ సొంతం చేసుకుంది. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సెలబ్రిటీలను సైతం ఆకట్టుకుంటోంది. నటుడిగా, దర్శకుడిగా రిషబ్ శెట్టి ఫుల్ మార్కులు సొంతం చేసుకున్నారు. తాజాగా బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ఈ చిత్రంపై ప్రశంసలు కురిపించారు. కుటుంబ సభ్యులతో కలిసి కాంతార సినిమా చూశా. ఇప్పటికీ నా శరీరం వణుకుతూనే ఉంది. ఇదొక అద్భుతమైన అనుభవం. సాంప్రదాయం, జానపద కథలు, దేశీయ సమస్యల సమ్మేళనమే ఈ చిత్రం. రిషబ్ శెట్టికి హ్యాట్సాఫ్. రచన, దర్శకత్వం, నటన.. అన్నీ మరో స్థాయిలో ఉన్నాయి. ప్రకృతి అందాలను చూపించిన విధానం, యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించిన తీరు అద్భుతంగా ఉంది. సినిమా అంటే ఇది. ఇప్పటి వరకు ఇలాంటి సినిమాను చూడలేదంటూ కొందరు ప్రేక్షకులు సినిమా అయిపోయిన తర్వాత బయటకు వస్తూ అనుకుంటుండటం నేను విన్నాను. ఇలాంటి సినిమా తీసినందుకు ధన్యవాదాలు. మరో వారం పాటు ఈ అనుభూతి నుంచి నేను బయటకు రాలేననే అనుకుంటున్నా అంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. కన్నడ నటుడు రిషబ్ శెట్టి హీరోగా నటించి దర్శకత్వం వహించిన సినిమా 'కాంతార'.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com